విలేఖరులు కావలెను
రాష్ట్ర వ్యాప్తముగా అన్ని జిల్లా లకు బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్ లు, నియోజకవర్గ స్థాయి ఇంచార్జ్ లు, మండలముల వారిగా రిపోర్టర్ లు కావలెను.
(అనుభవము కలవారికి ప్రాధాన్యత కలదు)
పూర్తి వివరములకు : 6281086394
సంప్రదించగలరు ఎడిటర్ చల్లా శ్రీకాంత్

రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక
ROYAL JOURNALISM
RNI : APBIL/2023/86665

గుంటూరు | సంపుటి : 01 | సంచిక : 178 | చీఫ్-ఎడిటర్ : చల్లా శ్రీనివాసరావు | ఆదివారం 21 జూలై 2024 | పేజీలు : 8 | వెల :రూ 2-00

GUNTUR | VOL-01 | ISSUE - 178 | CHIEF EDITOR : CHALLA SRINIVASA RAO | 21 SUNDAY JUNE 2024 | PAGES : 8 | Rs :2-00

# బంగ్లాదేశ్‌లో అల్లర్లు.. స్వదేశానికి చేరుకున్న 1000 మంది భారత విద్యార్థులు

ఢాకా: ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల విధానాన్ని సంస్కరించాలంటూ బంగ్లాదేశ్‌లో విద్యార్థులు చేస్తోన్న ఆందోళనలు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయి. ఈ నేపథ్యంలో అక్కడ చదువుకుంటున్న పలువురు భారత విద్యార్థులు సురక్షితంగా స్వదేశానికి చేరుకుంటున్నారు. ఇప్పటివరకు సుమారు 1000 మంది విద్యార్థులు వచ్చారు. వారిలో 778 మంది సరిహద్దు మార్గాల ద్వారా రాగా, మరో 200 మంది విమానాల్లో సొంత దేశానికి చేరుకున్నారు. ఈ విషయాన్ని భారత విదేశాంగ శాఖ అధికారిక ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ఎక్స్(ట్విటర్) వేదికగా వెల్లడించారు. అంతర్జాతీయ సరిహద్దు ద్వారా బంగ్లాదేశ్ నుంచి భారత్ చేరుకుంటున్న విద్యార్థుల సురక్షిత ప్రయాణానికి ఢాకాలోని భారత హై కమిషన్ అన్ని సదుపాయాలు కల్పిస్తోందని విదేశాంగ శాఖ తెలిపింది. ఈ నిమిత్తం పౌర విమానయాన శాఖ, సరిహద్దు భద్రతా దళంతో సంప్రదింపులు జరుపుతోందని వెల్లడించింది. ఇప్పటికే దాదాపు 1000 మంది విద్యార్థులు స్వదేశానికి రాగా..



ఇంకా వివిధ విశ్వవి ద్యాలయాల్లో ఉన్న 4వేల మంది విద్యార్థులతో హై కమిషన్ కాంటాక్ట్‌లో ఉంది. ఆందోళనకారులు, పోలీసులకు మధ్య జరుగుతున్న ఘర్షణల్లో ఇప్పటివరకు 100 మందికి పైగా మృతిచెందినట్లు పలు మీడియా కథనాలు వెల్లడిం చాయి. పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో శుక్రవారం అర్ధరాత్రి నుంచి దేశవ్యాప్తంగా కర్ఫ్యూ విధించారు. సైన్యాన్ని రంగం లోకి దించారు. పలు చోట్ల పెద్దఎత్తున ఆర్మీ బలగా లను మోహరించారు. దాంతో విమాన టికెట్లు బుక్ చేసుకు న్న వారు.. విమానాశ్రయాలకు చేరుకోవడం కష్టంగా మారి ంది. కర్ఫ్యూ నేపథ్యంలో కొన్ని సంస్థలు విమాన సేవల్ని రద్దు చేశాయి.

**విదేశీ పర్యటన రద్దు చేసుకున్న హసీనా**

ప్రస్తుత పరిస్థితుల వేళ.. బంగ్లా ప్రధాని షేక్ హసీనా అధికారిక విదేశీ పర్యటనను రద్దు చేసుకున్నారు. ఆమె స్పెయిన్, బ్రెజిల్ వెళ్లాల్సి ఉంది. అలాగే ఆందోళన చేస్తున్న విద్యార్థులను ఆమె చర్చలకు ఆహ్వానించారు. ప్రస్తుత కోటా విధానం ప్రకారం.. 1971లో బంగ్లాదేశ్ విముక్త పోరాటంలో అశువులు బాసిన వారి పిల్లలకు, మనవళ్లు, మనవరాళ్లకు 30శాతం రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయి. 10శాతం స్థానిక పరిపాలన జిల్లాల వారికి, 10శాతం మహిళలకు, 5శాతం మైనారిటీ తెగల వారికి, 1శాతం దివ్యాంగులకు ఇస్తున్నారు. ఈ పద్ధతిని సంస్కరించి.. ప్రతిభ ఆధారంగా మొదటి, రెండో శ్రేణి ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండు చేస్తూ బంగ్లాదేశ్‌లోని ప్రధాన నగరాలైన ఢాకా, రాజ్‌షాహీ, ఖుల్నా, చత్తోగ్రాంలలో పెద్దఎత్తున ఆందోళనలు జరుగుతున్నాయి. దీనికి ఢాకా విశ్వవిద్యాలయ విద్యార్థులు నాయకత్వం వహిస్తున్నారు.

# పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఎంపీలకు చంద్రబాబు దిశానిర్దేశం



అమరావతి: ఏపీ అభివృద్ధే ప్రధాన అజెండాగా పోటీ పడి పనిచేయాలని ముఖ్యమ ంత్రి చంద్రబాబు ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. ఈనెల 22 నుంచి పార్లమెంట్ సమా వేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన తెలుగుదేశం పార్లమె ంటరీ పార్టీ సమావేశం జరిగింది. మంత్రుల నుంచి వివిధ శాఖలకు చెందిన సమాచారం తీసుకుని కేంద్రంతో సంప్రదింపులు జరపాలని సీఎం సూచించారు. అవసరాన్ని బట్టి రాష్ట్ర మంత్రులను వెంటబెట్టు కుని ఆయా శాఖలకు చెందిన కేంద్రమంత్రు లను కలవాలని ఆదేశించారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టుకు రావాల్సిన నిధులపై భేటీలో చర్చించారు. దిల్లీలో జగన్ ధర్నా చేయనున్నారన్న అంశం భేటీలో ప్రస్తావనకు వచ్చినట్టు సమా చారం. జగన్, అతని పార్టీ గురించి ఆలోచన చేయాల్సి న అవసరం లేదని పలువురు ఎంపీలు అన్నట్టు తెలుస్తోంది. జగన్ గురించి ఒక్క క్షణం ఆలోచించే సమయాన్ని కూడా రాష్ట్రాభివృద్ధి కోసం వెచ్చించాలని ఓ మంత్రి అన్నట్టు తెలిసింది. దిల్లీలో జగనేం చేస్తారో ముఖ్యం కాదని, మన మేం చేయాల నేదే ముఖ్యమని చంద్రబాబు స్పష్టం చేశారు.

# కులగణన కరెక్టే కానీ.. కేంద్రమంత్రి ఆసక్తికర వ్యాఖ్యలు!



దిల్లీ: దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన నిర్వహించాలని కొంతకాలంగా ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే కులగణనపై స్పందించిన కేంద్రమంత్రి, లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) అధ్యక్షుడు చిరాగ్ పాసవాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దేశంలో కులగణన చేపట్టేందుకు మద్దతు తెలిపారు. కానీ, అది సమాజ విభజనకు దారి తీస్తుందన్నారు. అందుకే వాటి సమాచారాన్ని బహిర్గతం చేయకూడదని హెచ్చరించారు. "కమ్యూనిటీ ఆధారిత అభివృద్ధి పథకాలకు నిధుల కేటాయింపు కోసం నిర్దిష్ట డేటా తరచూ అవసరమవుతోంది. న్యాయపరమైన సమస్యలను పరిష్కరించడంలోనూ ఈ డేటా ఉపయోగపడుతుంది. కులగణన నిర్వహించడం అవసరమే. కానీ, ఇందులో కొన్ని సమస్యలు కూడా ఉన్నాయి. కులగణన ద్వారా సమాజంలో విభజన ఏర్పడే అవకాశం లేకపోలేదు. కాబట్టి ఈ గణాంకాలను బయటకు తీసుకురావడం అంత మంచిది కాదు. ఎన్డీయే ప్రభుత్వంలో దీనిపై ఇప్పటివరకు ఎలాంటి చర్చ జరగలేదు" అని విలేకరుల సమావేశంలో చిరాగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. "భిన్నత్వంలో ఏకత్వాన్ని భారత్‌లో చూడవచ్చు. కానీ, ఛత్తీస్‌గఢ్‌లో కనుక చూస్తే కొందరు ఆదివాసీలు వీటికి దూరంగా ఉంటున్నారు. అలాంటి వారందరినీ ఒకే గొడుగు కిందకి తీసుకురాగలమా? కులగణనకు ముందు ఒక ముసాయిదా తీసుకురావాల్సి ఉంటుంది. దాన్ని పరిశీలించి కీలక నిర్ణయాలు తీసుకోవాలి. అది వచ్చేంత వరకు నేనేమీ మాట్లాడలేను" అని పేర్కొన్నారు. దేశంలో కులగణన చేపట్టాలని ప్రతిపక్షాలు కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై ఇంతవరకు మోదీ సర్కార్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ క్రమంలోనే కేంద్రమంత్రి చిరాగ్ పాసవాన్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

# వైభవంగా 'సింహగిరి' ప్రదక్షిణ.. భక్త జనసంద్రంగా మారిన సింహాచలం

విశాఖపట్నం: సింహాచలం వరాహలక్ష్మీ నరసింహస్వామి గిరి ప్రదక్షిణ వైభవోపేతంగా కొనసాగుతోంది. సింహాచలం తొలి పావంచా దగ్గర కొబ్బరికాయ కొట్టిన భక్తులు..అక్కడి నుంచి అడవివరం, పెదగదిలి, చినగదిలి, హనుమంతువాక, విశాలాక్షి నగర్ అప్పుఘర్, సీతమ్మధార, నరసింహ నగర్, మాధవధార, ఎన్ఏడీ, గోపాలపట్నం, ప్రహ్లాదపురం, గోశాల మీదుగా మళ్లీ తొలి మెట్టు వరకు 32 కి.మీ మేర భక్తులు గిరిప్రదక్షిణ చేస్తున్నారు. సింహగిరి' ప్రదక్షిణ సాగే మార్గంలో ప్రతి 500 మీటర్లకు ఒక కౌంటర్ ద్వారా భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు చేశారు. అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటిని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించి పరిశీలిస్తున్నారు. ఏటా ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని చతుర్దశినాడు సింహాచలం గిరి ప్రదక్షిణ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా నుంచి వచ్చిన లక్షలాది మంది భక్తులు ఈ వేడుకలో పాల్గొన్నారు. పౌర్ణమి సందర్భంగా ఆదివారం వేకువజామున సింహాద్రి నాథుడికి తుది విడత చందనం సమర్పిస్తారు.



# ఏపీ వ్యాప్తంగా భారీ వర్షాలు.. పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

అమరావతి: గత రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు ఏపీలోని పలు జిల్లాలను అతలాకుతలం చేస్తున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాను భారీ వర్షాలు ముంచెత్తాయి. విశాఖ జిల్లాలో భారీ వర్షాల కారణంగా విద్యాసంస్థలకు కలెక్టర్ సెలవు ప్రకటించారు. అనకాపల్లి జిల్లాలో కల్యాణపులోవ జలాశయం నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరింది. జలాశయం రెండు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. తాండవ జలాశయం ప్రస్తుత నీటిమట్టం 365 అడుగులుగా ఉంది. మరోవైపు తాడిగిరి వంతెన పైనుంచి వరద ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. దీంతో 10 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వర్షానికి అనకాపల్లి జిల్లాలో వరినాట్లు కొట్టుకుపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌తో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడారు. అధికారులంతా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మత్స్యకారులెవరూ చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. సహాయ చర్యలకు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని వినియోగించుకోవాలని సూచించారు. ఉమ్మడి విజయనగరం జిల్లాల్లో ఎడతెరిపి లేని వర్షం కురుస్తోంది. భారీ వర్షాలతో పలు ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. జిల్లాలోని విద్యా సంస్థలన్నింటికీ సెలవు



ప్రకటించారు. అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం రామరాజుపాలెం వద్ద వంతెనపై వరద ప్రవహిస్తోంది. ంతో కేడీపేట-చింతపల్లి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. రాజవొమ్మంగి మండలం ఎర్రంపాడు వద్ద వరద ఉద్ధృతి పెరిగింది. మరోవైపు వట్టిగెడ్డ జలాశయం పొర్లుకాలువ ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. చింతూరు-కుయుగురు మధ్య వంతెన పై నుంచి వాగు ప్రవహిస్తుండటంతో..ఏపీ, ఒడిశా మధ్య రాకపోకలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్నాయి. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో ప్రకాశం బ్యారేజ్‌కు భారీగా వరద పోటెత్తింది. బ్యారేజ్ నుంచి కాల్వల ద్వారా 3 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వర్షాల కారణంగా కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. పులిచింతల ప్రాజెక్టుకు క్రమంగా వరద పెరుగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం వంద అడుగులకు చేరుకుంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాలకు వరి పంట నీటిలోనే నానుతోంది. కోనసీమ, కాకినాడ జిల్లాల్లో 12 వేల హెక్టార్లకుపైగా వరి నాట్లు నీటమునిగాయి. రాజమహేంద్రవరం వద్ద గోదావరిలో వరద ప్రవాహం నిలకడగా ఉంది. ధవళేశ్వరం కాటన్ ఆనకట్ట వద్ద 7.8 అడుగుల నీటిమట్టం కొనసాగుతోంది. తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టా కాల్వలకు 1800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సముద్రంలోకి 3 లక్షల 9 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లాలోని గండి పోచమ్మ అమ్మవారి ఆలయం వద్ద గోదావరి ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. అమ్మవారి ఆలయం గోపురం వరకు వరద నీరు చేరింది. అమ్మవారి ఆలయం వద్ద ఇళ్లు పూర్తిగా నీట మునిగాయి. వరద పెరుగుతున్న నేపథ్యంలో అమ్మవారి దర్శనాలు పూర్తిగా నిలిపివేశారు. ఆ ఆలయం నుంచి పాపికొండల విహారయాత్ర నిలిచిపోయింది.

# సౌదీ అరేబియాలో చిక్కుకున్న వ్యక్తికి మంత్రి లోకేశ్ భరోసా



అమరావతి: సౌదీ అరేబియాలో దుర్భర జీవితం గడుపుతున్న మరో తెలుగు వ్యక్తికి మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. నకిలీ ఏజెంట్ చేతిలో మోసపోయి దుర్భర జీవితం గడుపుతున్నానంటూ వీరేంద్ర కుమార్ ఎక్స్(ట్విటర్)లో వీడియో పోస్టు చేశారు. ఖతర్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని మోసగించి సౌదీలోని ఎడారిలో ఒంటెల మధ్య తనను పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ బతకలేకపోతున్నానని పేర్కొన్నారు. వీరేంద్ర వీడియో చూసి మంత్రి నారా లోకేశ్ స్పందించారు. ధైర్యంగా ఉండాలని, స్వస్థలానికి తిరిగి తీసుకొచ్చే బాధ్యత తనదని ఆయన హామీ ఇచ్చారు.

# పూజా ఖేడ్కర్ వివాదం వేళ.. యూపీఎస్సీ ఛైర్మన్ అనూహ్య రాజీనామా..!




దిల్లీ: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ మనోజ్ సోనీ తన పదవికి రాజీనామా చేసినట్లు సమాచారం. వ్యక్తిగత కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారిక వర్గాలు శనివారం వెల్లడించాయి. గతేడాది ఏప్రిల్ నెలలోనే బాధ్యతలు చేపట్టిన ఆయన.. ఇంకా ఐదేళ్ల పదవీకాలం ఉండగానే అనూహ్యంగా రాజీనామా చేయడం గమనార్హం. ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేడ్కర్ వివాదం వేళ ఈ పరిణామాలు చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ఈ వివాదంతో మనోజ్ సోనీ రాజీనామాకు ఎటువంటి సంబంధం లేదని అధికారిక వర్గాలు వెల్లడించాయి. దాదాపు పదిహేను రోజుల క్రితమే ఆయన తన రాజీనామాను రాష్ట్రపతికి సమర్పించినట్లు పేర్కొన్నాయి. అయితే, దీన్ని ఇంకా ఆమోదించలేదని సదరు వర్గాలు తెలిపాయి. 2017లో యూపీఎస్సీ కమిషన్‌లో సభ్యుడిగా చేరి గతేడాది మే నెలలో ఛైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేశారు. 2029 మే 15 వరకు ఆయన పదవీకాలం ఉంది. అయితే, ఛైర్మన్ పదవి చేపట్టడానికి ఆయన ముందునుంచి సుముఖంగా లేరని సమాచారం. తనను ఈ బాధ్యతల నుంచి రిలీవ్ చేయాలని గతంలోనే ఓసారి అభ్యర్థించినట్లు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. ఇకపై, ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణించాలని సోనీ కోరుకుంటున్నట్లు తెలిపాయి. యూపీఎస్సీ ఛైర్మన్ పదవికి ముందు ఆయన గుజరాత్‌లోని డా. బాబాసాహెబ్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో వరుసగా రెండుసార్లు వీసీగా సేవలందించారు. అఖిలభారత సర్వీసులైన ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్, తదితర ఉద్యోగులను ఎంపిక చేసేందుకు యూపీఎస్సీ ఏటా సివిల్స్ సర్వీసెస్ పరీక్ష నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ పరీక్షతోనే ఐఏఎస్‌కు ఎంపికైన ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేడ్కర్ ఇటీవల అధికార దుర్వినియోగం, అవకతవకలకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలు తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేపట్టిన యూపీఎస్సీ ఆమెకు శుక్రవారం షోకాజ్ నోటీసు జారీ చేసింది.

# సీఎం చంద్రబాబు కార్యాలయంలోని నలుగురు అధికారులకు శాఖల కేటాయింపు




అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యాలయంలోని నలుగురు అధికారులు పర్యవేక్షించాల్సిన శాఖలను ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీఎం ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్రకు సీఎం కార్యాలయం, సాధారణ పరిపాలనశాఖ, హోమ్, ఆర్థిక, ఎక్సైజ్, రెవెన్యూ, దేవాదాయ శాఖలు కేటాయించారు. ఏవీ రాజమౌళికి జలవనరులు, విద్యుత్, గనులు, వ్యవసాయం, సీఎంఆర్ఎఫ్, ఫిర్యాదులు తదితర శాఖలు పర్యవేక్షించనున్నారు. ప్రద్యుమ్నకు రవాణా, పురపాలక, పంచాయతీరాజ్, ఆర్టీజీఎస్, అటవీ, పౌరసరఫరాలశాఖలు కేటాయించారు. కార్తికేయ మిశ్రాకు ఆర్థిక, ఐటీ, ఎన్ఆర్ఐ వ్యవహారాలు, సమాచార పౌరసంబంధాలు, పరిశ్రమలు, సీఎం దిల్లీ, విదేశీ పర్యటనల సమన్వయం తదితర విభాగాలు చూడనున్నారు.

రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక ROYAL JOURNALISM

# ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్య సేవలు కల్పించాలి

రాయల్ జర్నలిజం ( బాపట్ల ) జూలై 20 : ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి చెప్పారు. బాపట్లలోని ప్రాంతీయ వైద్యశాలను జిల్లా కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాలలో రోగుల పేర్ల నమోదు, ఓపి, ఇంజక్షన్ వేసే గది, హెచ్ఐవి కౌన్సిల్ గదులు, ఎక్స్ రే, స్కానింగ్ గదులు, చిన్నపిల్లల వార్డు, కాన్పులు, ప్రసూతి విభాగాలను పరిశీలించారు. బ్లడ్ స్టోరేజ్ యూనిట్, పురుషుల వార్డు, స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్, ల్యాబ్, ఐ సి యు, ఔషధాల నిల్వ కేంద్రం, అత్యవసర విభాగాలను పరిశీలించారు. ఆయా వార్డులలో వైద్యం పొందుతున్న రోగులతో ఆయన స్వయంగా మాట్లాడారు. వైద్యం సక్రమంగా జరుగుతుందా..., డాక్టర్లు బాగా చూస్తున్నారా..., సకాలంలో వైద్య సేవలు అందుతున్నాయా లేదా వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా.. అంటూ రోగులతో మాట్లాడుతూనే ఆరా తీశారు. ఆస్పత్రిలో బెడ్ల సామర్థ్యం, ప్రతిరోజు సగటున నమోదయ్యే ఓపీలు, వైద్యం కొరకు ఆసుపత్రిలో చేరుతున్న వారి సంఖ్య, అత్యవసర విభాగంలో సేవలు, ఆపరేషన్ లు జరుగుతున్న తీరు, ఔషధాల నిల్వలకు సంబంధించిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రోగుల వెంట వచ్చిన వారి బంధువులు వేచి ఉండడానికి ఎలాంటి సౌకర్యం లేదని కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతోను మాట్లాడారు. వర్షాల సీజన్ లో అంటువ్యాధులు ప్రభలకుండా వైద్యాధికారులు చర్యలు



తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకట మురళి అన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడానికే ప్రభుత్వ వైద్యశాలలు నడుస్తున్నాయన్నారు. జిల్లా కేంద్రమైన బాపట్లలోని ప్రాంతీయ వైద్యశాలలో 400కు పైగా ఓపీలు నమోదవుతున్నాయని చెప్పారు. ఏడు విభాగాలలో ఓపీలు నడుస్తుండగా, అత్యవసర సేవలు, ఆపరేషన్ల కొరకు సగటున ప్రతిరోజు నాలుగు నుంచి ఐదు వరకు బ్లడ్ ప్యాకెట్లు వినియోగిస్తున్నామన్నారు. ప్రస్తుతం బ్లడ్ స్టోరేజ్ విభాగంలో 49 బ్లడ్ ప్యాకెట్లు ఉన్నాయని, వాటి సామర్థ్యం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిరోజు సగటున 80 మందికి ఎక్స్ రే లు తీస్తున్నామని చెప్పారు. ఈ విభాగంలో కొంత సిబ్బంది కొరత ఉందన్నారు. రోగుల వెంట వచ్చిన వారు వేచి ఉండడానికి అవసరమైన షెడ్ ఏర్పాటు చేస్తామన్నారు. నిధులను సమీకరించి తక్షణమే చర్యలు తీసుకుంటామని లేదా దాతల సహాయంతో సత్వరమే ఏర్పాట్లు చేస్తామన్నారు. ప్రభుత్వ వైద్యశాలకు వచ్చిన వారంతా ఆరోగ్యవంతులై తిరిగి వెళ్లడమే లక్ష్యంగా డాక్టర్లు పనిచేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. నాణ్యమైన వైద్యం సకాలంలో అందించాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలలపై నిరంతరం వైద్యాధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. రక్త దాన శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రక్తం నిల్వలు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. 20 పడకల స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్ జిల్లాలో సమర్థంగా నడుస్తుందన్నారు. అప్పుడే పుట్టిన శిశువులు అనారోగ్యానికి గురైతే ప్రత్యేక యూనిట్ లో వైద్యం అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం రోజుల వ్యవధిలో జన్మించిన ఏడుగురు శిశువులు ఇక్కడ వైద్యం పొందుతున్నట్లు వివరించారు. ఐ సి యు విభాగం బాగా నడుస్తుందన్నారు. ప్రాంతీయ వైద్యశాలలో మంచి వైద్య సేవలు అందుతున్నాయన్నారు. రోగులతో మాట్లాడినప్పుడు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని, వైద్యుల సేవలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా కలెక్టర్ ఆకస్మిక పర్యటన విషయాలను తెలుసుకున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, ఏపీవీపీ కోఆర్డినేటర్ డాక్టర్ శేషు కుమార్, అక్కడకు చేరుకున్నారు. ఆయన వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ, తదితరులు ఉన్నారు.

## ముదివేడు కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపల్ సహా నలుగురు సస్పెండ్



రాయల్ జర్నలిజం (కురబలకోట) జూలై 20 : మండలంలోని ముదివేడు కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపల్ సహా నలుగురు సస్పెండ్ అయ్యారు. అన్నమయ్య జిల్లా, తంబళ్లపల్లె నియోజకవర్గం, కురబలకోట మండలం, ముదివేడు వద్ద ఉండే కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రెండు రోజుల క్రితం 9వ తరగతి చదివే ముగ్గురు మైనర్ బాలికలు మాత్రలు మింగి ఆత్మహత్నం చేశారు. ఈ ఘటనకు సంబంధించి ప్రిన్సిపల్ రఫియాపర్వీన్, హిందీ టీచర్ గౌషియామస్తానీ, ఏఎన్ఎం భాను, అకౌంటెంట్ లను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

## ద్విచక్ర వాహనదారులకు శిరస్త్రాణమే శ్రీ రామరక్ష




రాయల్ జర్నలిజం (లక్కిరెడ్డిపల్లె) జూలై 20 : ద్విచక్ర వాహనదారులు ప్రయాణం చేసేటప్పుడు ఖచ్చితంగా శిరస్త్రాణం ధరించాలని లక్కిరెడ్డిపల్లె సివిల్ కోర్టు జడ్జి షేక్ ఫైజున్నీసా పేర్కొన్నారు. మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిరస్త్రాణం లేని ప్రయాణం ప్రమాదకరమని ప్రతి వాహన దారుడు ప్రాణ రక్షణ కోసం శిరస్త్రాణం తప్పనిసరిగా ధరించాలన్నారు. అతివేగం ప్రమాదకరం. ఏదైనా ప్రమాదవశాత్తు జరిగితే వారి కుటుంబం మొత్తం అనాథలుగా మిగిలిపోతారు. కాబట్టి నెమ్మదిగా వెళ్ళండి. క్షేమంగా గమ్యం చేరండి. ఇంటిల్లిపాది తో సంతోషంగా ఉండండి. రోజు రోజుకు ద్విచక్ర వాహనాల ప్రమాదాలు ఎక్కువ అవుతున్నాయి. వాహనం నడిపేటప్పుడు ఒత్తిడితో కానీ అనేక ఆలోచనలతో కానీ ఆందోళనతో కానీ నడపరాదు. మరింత అప్రమత్తమై జాగ్రత్తగా నెమ్మదిగా వెళ్లాలి. మద్యం సేవించి వాహనాలు నడపరాదు. అలా నడిపిన చట్టరీత్యా నేరం. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలి. అంతేకాదు ఆటోలో ప్రయాణించే ప్రయాణికులు పరిమిత సంఖ్యలో మాత్రమే ఆటోలో ప్రయాణించాలి అని అవగాహన కల్పించడం జరిగింది . ఈ కార్యక్రమంలో సిఐ జీవన్ గంగానాథ్, బాబు ఎస్సై విష్ణువర్ధన్ ,న్యాయవాదులు ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి, రెడ్డన్న ,చెన్న కృష్ణయ్య, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డయేరియా, డెంగీ, పెద్దల బి.సి.జి. టీకాలపై అవగాహన

### డాక్టర్ కావ్య, గంధ



రాయల్ జర్నలిజం (కలికిరి) జులై 20 : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వారి ఆదేశాల మేరకు కలికిరి మండలం లోని మేడికుర్తి పి.హెచ్.సి. వైద్యులు డాక్టర్ కావ్యగంధ ఆధ్వర్యంలో అందే కురవపల్లి, యల్లంపల్లి గ్రామాల్లో స్టాప్ డయేరియా, డెంగీ వ్యతిరేక మాసోత్సవాలు, పెద్దల బి.సి.జి. టీకాలు, కుష్ఠ వ్యాధి ఇంటింటి సర్వేలపై హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, టి.బి.పర్యవేక్షకులు నాగిరెడ్డి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ సోమ, గురు వారాలలో అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అర్హులైన 6 వర్గాలవారికి బి.సి.జి. టీకాలు వేస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా ముఖ్యంగా చేతులు శుభ్రత పాటించాలని, త్రాగు నీటిని కాచి చల్లార్చి త్రాగాలని, వ్యక్తిగత మరియు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు అన్ని ఆరోగ్య, అంగన్వాడీ కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఓ.ఆర్.ఎస్ ద్రావణాన్ని ఎలా తయారు చేయడం తెలిపారు. అనంతరం డెంగీ జ్వరాలు ప్రబలకుండా ఫ్రైడే డ్రై డే పాటించాలని, కిటికీలకు మెష్ కొట్టించుకోవాలని, ఇంటి పరిసరాలలో నీరు నిల్వ లేకుండా చేసుకోవాలని సూచించారు. స్పర్శ, నొప్పి లేని మచ్చలు కుష్ఠ వ్యాధి కావచ్చు ఇటువంటి మచ్చలు శరీరంలో ఏ భాగం లో అయినా ఉండవచ్చు వీటిని తొలిదశలో గుర్తించి చికిత్స తీసుకోవాలి అన్నారు. నిర్లక్ష్యం చేసిన యెడల నరాలకు జబ్బు విస్తరించి అంగవైకల్యం వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్.ఎల్.హెచ్.పి. కృష్ణ కుమారి, ఏ.ఎన్.ఎమ్. రమాదేవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ బృందం సందర్శన

రాయల్ జర్నలిజం ( బాపట్ల ) జూలై 20 : బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులు ఎన్.ఏ.ఏ.సి బృందం సందర్శించారు. మొదటిరోజు సందర్శనలో భాగంగా ఎన్.ఏ.ఏ.సి బృందం ఎన్.సి.సి %ఉ% ఎన్.ఎస్.ఎస్ క్యాడెట్స్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. కళాశాల యాజమాన్యం వారిని పూర్ణకుంభంతో స్వాగతంపలికారు. ఈ బృందానికి డాక్టర్ వైదేహి విజయ్ కుమార్ అధ్యక్షతగా వ్యవహరించారు. ఎన్.ఏ.ఏ.సి బృందం కళాశాలలోని అన్ని విభాగాలను, కాలేజీ మౌలిక సదుపాయాలను పరిశీలించారు. పూర్వ విద్యార్థినిలు, తల్లిదండ్రులు, కళాశాల విద్యార్థులు అధ్యాపకులతో చర్చించి వారి సలహాలను సూచనలను పరిగణలోనికి తీసుకున్నట్లు తెలిపారు. ఎన్.ఏ.ఏ.సి బృందం పరిశీలనలో భాగంగా ఎక్జిట్ మీట్లో వారి అమూల్యమైన సలహాలు, సూచనలు కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ ఐ క్యు ఎ సి కోఆర్డినేటర్, విభాగపతులు మరియు అధ్యాపకులతో పంచుకున్నారు. వారి బృందం యొక్క నివేదికను కళాశాల ప్రిన్సిపాల్ కి అందజేశారు. కళాశాల యాజమాన్యం వారికి కృతజ్ఞతలు



తెలియజేసింది. అనంతరం విద్యార్థినిల సాంస్కృతిక, నృత్య ప్రదర్శనతో అలరించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్లు డి. రామ్మోహన్ రావు, గెల్లి దిలీప్ కుమార్, సెక్రెటరీ మానం నాగేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ కె. హరి పద్మ ప్రసాద్, ట్రెజరర్ టి. రామకృష్ణారావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. శ్రీనివాసరావు, విభాగపతులు అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## కృష్ణానది పరివాహక ప్రాంతాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ



రాయల్ జర్నలిజం ( బాపట్ల ) జూలై 20 : రాష్ట్రంలో విస్తారంగా కురుస్తున్న వర్షాల పూర్తిగా తగ్గుముఖం పట్టే వరకు పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. శనివారం ఎస్పీ స్వయంగా కృష్ణానది పరివాహక ప్రాంతాన్ని పరిశీలించి, లోతట్టు ప్రదేశాల పరిస్థితులను గురించి స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెనుమూడి వంతెన వద్ద కృష్ణానది నది ప్రవాహాన్ని పరిశీలించారు. అనంతరం రేపల్లె డీఎస్పీ కార్యాలయాన్ని సందర్శించి నది పరివాహక ప్రాంతాలలో తీసుకోవలసిన ముందస్తు చర్యల గురించి సమీక్షించి పోలీస్ అధికారులకు పలు సూచనలు చేసినారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో అల్పపీడన ప్రభావంతో విస్తారంగా వర్షాలు పడుతున్నాయన్నారు. అల్పపీడన ద్రోణి ప్రభావం మరో రెండు రోజులు ఉండే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాలలో ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా ప్రకాశం బ్యారేజ్ నుండి నీటిని కిందకి విడుదల చేస్తున్న నేపథ్యంలో కృష్ణానది పరివాహక ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించడం జరిగిందన్నారు. జిల్లాలోని కృష్ణానది పరివాహక ప్రాంతాలలో, లంక గ్రామాలలోని పరిస్థితుల గురించి పోలీస్ అధికారులతో చర్చించి, తీసుకోవలసిన ముందస్తు చర్యల గురించి, ఒకవేళ వరద ముంపు సంభవిస్తే ఎటువంటి చర్యలు తీసుకోవాలో తగిన సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. ఎటువంటి విపత్కర పరిస్థితులైన ఎదుర్కొని ప్రజలకు సేవ చేసేందుకు పోలీస్ శాఖ సిద్ధంగా ఉందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కాలువలు, వాగులు, నదులు ప్రమాద స్థాయిలో ప్రవహించే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాలలో నివాసం ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వరద ముంపునకు గురవడానికి అవకాశం ఉన్న ప్రదేశాలలో నివాసం ఉండే ప్రజలు ప్రభుత్వం సూచించిన పునరావాసాలలోకి వెళ్లాలని, బ్రిడ్జిలు, కల్వర్టుల పై వరద నీరు ప్రవహిస్తుంటే వాటిని దాటి వెళ్లే ప్రయత్నం చేయవద్దని, ప్రత్యామ్నాయ మార్గాన్ని చూసుకోవాలని, ప్రజలు ప్రమాదాలకు గురికాకూడదనే ఉద్దేశంతో పోలీసులు సూచించే సూచనలు తప్పనిసరిగా పాటించాలని, అవి మీ యొక్క భద్రత కొరకే అని గ్రహించాలని, ప్రజలు పోలీసుల తక్షణ సహాయం కొరకు డయల్ 100/112 కి, లేదా స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని ఎస్పీ తెలిపారు. జిల్లా ఎస్పీ వెంట రేపల్లె డిఎస్పి టి.మురళీకృష్ణ, రేపల్లె పట్టణ ఇన్స్పెక్టర్ ఎస్.కె నజీర్ బేగ్, ఇతర పోలీస్ అధికారులు సిబ్బంది ఉన్నారు.

## బాపట్లలో జిల్లాస్థాయి చదరంగం పోటీలు

రాయల్ జర్నలిజం ( బాపట్ల ) జూలై 20 : జిల్లా సాయి చదరంగం పోటీలు 7 సంవత్సరంల లోపు,11 సంవత్సరంలోపు బాల బాలికలకు లిటిల్ యాంజెల్స్ ప్లే స్కూల్ ( విజయలక్ష్మీ పురం ) నందు ది. 22-07-2024 సాయంత్రం 5 గంటల నుండి 8 గంటల వరకుపోటీలు జరుగును. ఈ పోటీలలో ప్రథమ ద్వితీయ స్థానములు సాధించిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు పంపబడును. 7 సంవత్సరాలు లోపు గెలుపొందిన బాలబాలికలు రాష్ట్రస్థాయిలో ఆగస్టు 3, 4 తేదీలలో విజయనగరం నందు,11 సంవత్సరంలో లోపు బాల బాలికలు రాష్ట్రస్థాయిలో జూలై 27,28 తేదీలలో భీమవరం నందు ఆడుదురు, బాల బాలికలు జనన ధ్రువ పత్రములు, చదరంగం కిట్టు తీసుకొని రావలెను. ఎంట్రీ ఫీజు రూ.200లు జిల్లా కార్యదర్శి నరేష్,94 93501506 నెంబరుకు గూగుల్ పే/ ఫోన్ పే ద్వారా చెల్లించగలరు. ఇతర వివరములకు సూరా విజయబాబు(9393656432) సంప్రదించాలని కోరారు. లిటిల్ యాంజెల్స్ ప్లే స్కూల్ నందు జరిగిన విలేకరుల సమావేశంలో శనివారం తెలియజేశారు.

## ఆసిఫ్ అలీ ఖాన్ చిత్రపటానికి నివాళులర్పించిన మంత్రి డిప్యూటీ చైర్మన్




రాయల్ జర్నలిజం ( రాయచోటి ) జులై 20 : అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని 30 వ వార్డు కౌన్సిలర్ ఆసిఫ్ అలీ ఖాన్ చిత్రపటానికి శాసనమండలి మొట్టమొదటి మహిళా డిప్యూటీ చైర్మన్ శ్రీమతి మయాన జకియా ఖానమ్, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ భాష, వైస్ చైర్మన్, ఫయాజుర్ రెహ్మాన్, కౌన్సిలర్లు నివాళులర్పించారు. కౌన్సిలర్ సభ్యులు ఆశించారు అలీ ఖాన్ బాల్యం నుండే సేవాగుణంతోపాటు సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించే వారిని రాజకీయ ప్రస్థానం కలిగిన కుటుంబానికి చెందిన వారిని ప్రజా నాయకుడు దివ్వంత అఫ్జల్ అలీ ఖాన్ కి స్వయానా సోదరుడు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ మరి 2021 జరిగిన మున్సిపల్ సాధారణ ఎన్నికల్లో 30 వార్డుకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నిరంతరం ప్రజాసేవలలో అహర్నిశలు కృషి చేసి ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు. మరియు 30 వ వార్డు అభివృద్ధికి ప్రతి సభలో తన వాణిని బలంగా వినిపించేవారు సభలో హుందాగా వ్యవహరిస్తూ, సభా మర్యాదలను కాపాడుతూ తోట సభ్యులు మరియు అధికారులతో గౌరవంగా మెలిగేవారు. ఆయన చేసిన సేవల్ని కౌన్సిలర్లు కొనియాడారు. ఆకస్మికంగా గుండెపోటుతో కన్నుమూశారు వీరు సేవలు ఎప్పటికీ మరవలేవని ,కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ మరియు కౌన్సిలర్లు తెలిపారు.

## మాలమహానాడు రాయలసీమ జిల్లాల ముఖ్య నాయకుల సమావేశం జయప్రదం చేయండి

### రాయలసీమ జిల్లాల నేత నగరిమడుగు సుభాష్ పిలుపు

రాయల్ జర్నలిజం (పీలేరు) జులై 20 : జులై 22న తిరుపతి జిల్లాలో జరుగు మాలమహానాడు రాయలసీమ జిల్లాల ముఖ్య నాయకుల సమావేశం జయప్రదం చేయాలని రాయలసీమ జిల్లాల కార్యదర్శి నగరిమడుగు సుభాష్ జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి మల్లికార్జున లు పిలుపునిచ్చారు. పీలేరు మండల కేంద్రం మాలమహానాడు మండల కార్యాలయంలో పీలేరు నియోజకవర్గ ఉపాధ్యక్షులు మల్లెపల్లి రామచంద్రయ్య ఆధ్వర్యంలో సమావేశం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమావేశంలో ముఖ్య అతిథులుగా మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ దళితరత్న "డాక్టర్" యమలా సుదర్శనం పాల్గొంటారని తెలిపారు. గతంలో మనకు చెందిన 27 సంక్షేమ పథకాల రద్దు ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్ళించడం రిజర్వేషన్లు ఎన్నికైన మన జాతి ప్రతినిధులు పాలకులకు దాసోహమైనారు రిజర్వేషన్ల ఉద్దేశాలను పట్టించుకోలేదు కేంద్రం సహితం నియంత పాలనగా మారింది అదే విధంగా మాలలు 30 సంఘాలుగా ఏర్పడి ఎవరికి వారే యమునా తీరుగా మారారు అన్ని రంగాలలో మాలలు ఉన్నతంగా రాణించే విధంగా మనమందరం కలసి అడుగులు వేయాలని ముఖ్యంగా రాజకీయంగా మాలలు రాణించాల్సి ఉందని ఇందుకోసం సామాజికంగా ఆర్థికంగా యువత బలోపేతం ఆవాల్సిన అవసరం ఉందని ఈ పరిస్థితిలో మనం సంఘాన్ని పునర్ నిర్మాణం చేసుకోవాల్సిన అవసరం తమకు వుందని తెలియజేస్తూ రాయలసీమ జిల్లాలైన చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం,




నెల్లూరు, జిల్లాల మాలల ముఖ్య నాయకుల్ని ఒక తాటిపైకి తేవడానికి ఈనెల జూలై 22న తిరుపతి కేంద్రంగా తిరుపతి పట్టణం యూత్ హాస్టల్ నందు ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించడం జరుగుతుందని కావున రాయలసీమ జిల్లాలోని రాష్ట్ర నాయకులు డివిజన్ నాయకులు జిల్లా నాయకులు మండల కమిటీల నాయకులు మాల మహానాడు ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించ నున్నట్లు వారు తెలిపారు. పై కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్, మండల ఉపాధ్యక్షులు గుర్రం లోకనాథం, మండల కార్యదర్శి జెట్టి రాజశేఖర్, సహాయ కార్యదర్శి దప్పేపల్లి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో కురుస్తున్న వర్షాల పట్ల రైతులు జాగ్రత్తలు వహించాలి

రాయల్ జర్నలిజం ( బాపట్ల ) జూలై 20 : అధిక వర్షాలకు వెదవరి లో రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని, తద్వారా నష్టం జరగకుండా నివారించవచ్చని ఏరువాక కేంద్రం బాపట్ల కో-ఆర్డినేటర్ డా ఆర్.బాల మురళీధర్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గత రెండు, మూడు రోజుల నుంచి అధిక వర్షాలు కురుస్తున్నాయని, మరో రెండు రోజులు కూడా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లాలో వేసిన వెద వరిలో రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలను బాల మురళీధర్ వివరించారు. వెద వరి విత్తుకొని మొలకరాని పొలాల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపించినట్లయితే మొలక రావటానికి అవకాశముందన్నారు. వెద వరి విత్తన 10 నుంచి 30 రోజులైన పొలాల్లో నిల్వనీటిని తీసివేయాలని సూచించారు. వర్షాలు తగ్గిన తర్వాత ఎకరానికి ఒక బస్తా డి.ఎ.పి., 25 కిలోల యూరియా మరియు 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను వేసుకోవాలని తెలిపారు. వర్షాలు తగ్గిన తర్వాత వెదవరి విత్తిన 15 నుంచి 20 రోజులైన పొలాల్లో 100 మి.లీ బిస్పైరిబాక్ సోడియం 10% %వా% లేదా యఫామెన్ ఇథాక్సీసల్ఫ్యూరాన్ 30% మందును ఏ 90 గ్రా/ఎకరానికి 200 లీటర్ల నీటికి కలిపి ఒక ఎకరా పొలంలో కలుపు నివారణకు పిచికారి చేసుకోవాలని వివరించారు. వర్షాలు తగ్గిన తర్వాత వెదవరి విత్తిన 25 రోజులు నుంచి 30 రోజుల మధ్యలో 8 గ్రా మెటసల్ఫ్యూరాన్ మిథైల్ ం క్లోరిమురాన్ మందును 8 %గ్రా%/ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి కలుపు నివారణకు పిచికారి చేయాలన్నారు.

# పసిబాలుడి వైద్యానికి ఆర్థిక సహాయం



రాయల్ జర్నలిజం ( బాపట్ల ) జూలై 20 : పసి బాలుడి ఒంటిపై సాంబార్ పడి ఒంటికి తీవ్ర గాయాలు పాలైన బాలుడికి ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం అందించమని ఆర్గనైజేషన్ గౌరవాధ్యక్షులు వేజెండ్ల శ్రీనివాసరావు అన్నారు. బాపట్ల పట్టణం చీల్ రోడ్డు ప్రాంతానికి చెందిన 8 సంవత్సరాల హుస్సేన్ భాష ఒళ్ళు కాళీ ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బాలుడికి రూ 5000 ఆర్థిక సహాయాన్ని శనివారం అందించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు బండ్రెడ్డి గోపి మాట్లాడుతూ చిల్ రోడ్డు ప్రాంతానికి చెందిన బిబి అనే వృద్ధురాలు అదే ప్రాంతంలో అద్దె నివాసంలో ఉంటూ ఓ హోటల్లో పనిచేస్తున్నారని చెప్పారు. ఆమె మనవడు హుస్సేన్ భాష బీబీ కోసం వెళ్లి ప్లాస్టిక్ కవర్ పై కాలు వేసి కాలు జారి సాంబార్ బకెట్ పై పడడంతో వేడివేడిగా ఉన్న సాంబారు ఒంటిపై పడి తీవ్ర గాయాల పాలయ్యారన్నారు. ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ద్వారా సహాయం చేయాలని కోరిన మేరకు ఆర్గనైజేషన్ సభ్యుల సహాయ సహకారాలతో బాలుడికి వైద్య ఖర్చుల నిమిత్తం కొంత ఆర్థిక సహాయాన్ని అందజేశామని బాలుడికి మరికొంత మంది సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బత్తుల సురేష్, ట్రెజరర్ జోగి సువర్ణరాజు, సభ్యులు యాసం రాజా రమేష్,విన్నకోట శ్రీనివాసరావు, ఓటికుండల లక్ష్మణరావు, చామర్తి సుబ్బారావు తదితరులు ఉన్నారు.

# భావపురి బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు చేయూత



రాయల్ జర్నలిజం ( బాపట్ల ) జూలై 20 : గురుపూర్ణిమ సంథర్భంగా భావపురి బ్రాహ్మణ సమాఖ్య బాపట్ల వారి ఆధ్వర్యంలో శనివారం రెల్లికాలనీ, రైలుపేట బాపట్లలో విధ్యనభ్యసిస్తున్న 100 మంది పేద విద్యార్థినీ విథ్యార్థులకు రాత పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్ళు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీచేయటమైనది. ఈ సంథర్భంగా సమాఖ్య అధ్యక్షులు నిభానుపూడి శ్రీహరిప్రకాష్ మాట్లాడుతూ పిల్లలు చదువుతో పాటు, క్రమశిక్షణగా మెలుగుతూ, అన్ని సౌకర్యాలు గల ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకొని ఉన్నత చదువులతో పైకి రావాలని కోరారు. తరువాత విజయలక్ష్మిపురంలో శ్రీ సీతారామ మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 35 మంది విథ్యార్థినీ విథ్యార్థులకు, మరుప్రోలువారిపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 60 మంది విథ్యార్థినీ విథ్యార్థులకు కూడా భావపురి బ్రాహ్మణ సమాఖ్య ఆథ్వర్య ంలో రాత పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్ళు పంపిణీ చేయటమైనది. ఈ కార్యక్రమంలో భావపురి బ్రాహ్మణ సమాఖ్య కార్యవర్గ సభ్యులు శ్రీహరి ప్రకాష్, సోమరాజు శ్రీనివాస్, కొలను మోహన్, శ్రీకాంత్, రామారావు, హనుమంతరావు, శ్రీరామశర్మ, షణ్ముఖ, గూడా భట్టు శర్మ, శ్రీరామచంద్రమూర్తి, రాంగోపాల్, సుబ్బరామయ్య, సంబ ంధిత పాఠశాల ఉపాధ్యాయులు, విథ్యార్థినీ విథ్యార్థులు పాల్గొన్నారు.

# నగరంలో పరిమళించిన జానపదుని పాట



రాయల్ జర్నలిజం ( లక్కిరెడ్డిపల్లె ) జూలై 20 : స్థానిక లక్కిరెడ్డిపల్లె లోని జానపద కళాకారులైన చెప్పలి. లక్ష్మీ దేవమ్మ మరియు హార్మోనిస్ట్ జిల్లెల్ల మహాదేవ్ వారి బృందం కడప జిల్లా నుంచి ఆహా ఓటిటి ప్లాట్ ఫామ్ ఇండియన్ ఐడల్ సీజన్- 3 లో పాల్గొని తమ ప్రతిభను చాటారు. న్యాయ నిర్ణేతలైన ప్రముఖ సంగీత దర్శకులు తమన్ మరియు ప్రముఖ గాయని గీతా మాధురి వీరి జానపద పాటకు పరవశించిపోయారు. ఆ పరవశంలో ప్రముఖ సంగీత దర్శకులు తమన్ పవన్ కళ్యాణ్ %ూ+% సినిమాకు అడ్వాన్స్ టోకెన్ లక్ష్మీ దేవమ్మ కు ఇచ్చారు. అంతేకాదు హార్మోనిస్టు మహాదేవ్ వాయించిన హార్మోనియం ప్లేకు ఫిదా అయిపోయి సాంకేతిక పరిజ్ఞానం కలిగిన కీబోర్డ్ ను అందజేస్తామన్నారు. వీరు మట్టిలో పుట్టిన మాణిక్యమని తమన్ కొనియాడారు. జానపద పాటలు మన మూలమన్నారు. అవి మనకు పునాది లాంటివి అని తమన్ అన్నారు. లక్ష్మీదేవమ్మ ను మరియు మహాదేవ ను ప్రముఖ సంగీత దర్శకులు తమన్ వారి సన్మానించడం జరిగింది. గతంలో పుష్ప-2 సినిమాకు జానపద పాటను కూడా అందించారు. అంతేకాదు మట్కా సినిమా డైరెక్టర్ అప్పటికప్పుడే పాట పాడించుకొని అడ్వాన్స్ ఇవ్వడం కూడా జరిగింది అన్నారు హార్మోనిస్ట్ మహాదేవ్. ఎక్కడో మారుమూల పల్లె ప్రాంతాల్లో పుట్టి పెరిగిన మేము హరిక థలు, బుర్రకథలు, ఒగ్గు కథలు, వేమయ్య కథలు, భాగవతం, సాసల చిన్న చిన్నమ్మ కథలు వింటూ పెరిగిన వాళ్ళం వాటిని జీవనాధారంగా చేసుకొని జీవనం సాగించడం జరుగుతుంది. కళమ్మ తల్లి దయవల్ల ఇప్పుడిప్పుడే సినిమా అవకాశాలు రావడం, బుల్లితెరపై అవకాశాలు రావటం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాము అని లక్ష్మీ దేవమ్మ, హార్మోనిస్ట్ మహాదేవ్ హర్షం వ్యక్తం చేశారు.

# కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ పాలన సాగిస్తుంది



రాయల్ జర్నలిజం ( రాయచోటి ) జూలై 20 : రాయచోటి లోని వైఎస్ఆర్ సిపి కార్యాలయంలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులతో కలిసి మీడీయా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ అమలు క్యాలెండర్ కు అతిలేదు, గతిలేదని, మహిళలకు 1500 ఏప్పుడు వేస్తారు? ఖరీఫ్ ప్రారంభమయ్యి రెండు నెలలయిన ఇంతవరకు రైతులకు పెట్టుబడి సాయం ఏదని ప్రశ్నించారు. గత ప్రభుత్వం జూన్ మాసంలో అమ్మఒడి క్రింద ప్రతి తల్లికి 15000 వేసిందని, ఈ ప్రభుత్వం లో పిల్లల అడ్మిషన్లు జరిగి రెండు నెలలయిన తల్లికి వందనం ఎంతమంది వుంటే అంతమందికి ఏప్పుడో వేస్తారో చేప్పలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల గురించి కేంద్రం చంద్రబాబు ప్రభుత్వం కంటే తక్కువ జగన్ ప్రభుత్వం లోనే అప్పులని తేల్చిందన్నారు. శ్వేతపత్రాల ద్వారా ఒరిగేదేమిటి? ప్రజలకు ఎంత మంచి చేస్తున్నాం అన్నది చంద్రబాబు చెప్పాలన్నారు. మహానేత వైఎస్ఆర్ పేరు చెబితే ఉచిత కరెంట్, 108, ఆరోగ్య శ్రీ, ఫీజు రేయింబర్స్మెంట్ గుర్తుకు వస్తాయని, జగన్ పేరు చెబితే సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్, కోత్త జిల్లాలు, హర్బర్ లు, పోర్టులు, మెడికల్ కళాశాల లు అమ్మఒడి వంటి పథకాలు గుర్తుకు వస్తాయన్నారు. గతంలో చంద్రబాబు అమరావతి రాజధాని, పోలవరం పూర్తి చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. పోలవరం అనుమతులు మహానేత వైఎస్ఆర్ తీసుకోచ్చి పనులు ప్రారంబిస్తే ఆయన మరణం తర్వాత వచ్చిన ముఖ్యమంత్రులు ఏవ్వరు పట్టించుకోలేదని ఆరోపించారు. వైయస్ జగన్ ప్రభుత్వం లో పోలవరం పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయన్నారు. రాష్ట్రం లో జరుగుతున్న హత్యలు, దాడులు పై 23న ఢిల్లీ లో వైయస్ జగన్ ధర్నా చేపట్టనున్నారని, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ధర్నా లో పాల్గొంటారన్నారు. రాష్ట్రంలోని అరాచక పాలన పై ప్రధాని దృష్టికి తీసుకేళతామన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ లలో రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలన పై గళం విప్పుతామన్నారు.

# ప్లాస్టిక్ కవర్లు వాడినా,అమ్మినా,వినియోగించినా చర్యలు తప్పవు

## మున్సిపల్ కమీషనర్ వాసుబాబు



రాయల్ జర్నలిజం ( రాయచోటి ) జులై 20 : ఇకపై రాయచోటి మున్సిపాలిటీ పరిధిలో దుకాణ యజమానదారులు, తోపుల బండ్ల వారు ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమీషనర్ వాసు బాబు హెచ్చరించారు. పర్యావరణ పరిరక్షణ %ు%ప్రజారోగ్యం లో భాగంగా 2022 లోనే కేంద్ర ప్రభుత్వం 120 మైక్రాన్ ల కన్నా తక్కువ పరిమాణం ప్లాస్టిక్ వస్తువుల వినియోగం పై పూర్తి నిషేధం విధించినట్లు తెలిపారు.గతంలోనే పలు మార్లు ప్లాస్టిక్ వినియోగం, కలిగే నష్టాలపై అవగాహన కల్పించినా మార్పు రావడం లేదని అన్నారు. ఇకపై ప్లాస్టిక్ వాడకం 100%ఆగేంత వరకు పై ప్రతీ రోజు తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, దుకాణ దారులు అర్థం చేసుకోవాలని సూచించారు. ప్రజారోగ్యానికి, పర్యావరణానికి హాని కలిగించే 120 మైక్రాన్ కన్నా తక్కువ పరిమాణం గల ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు అమ్మడం, కొనడం వాడకం పూర్తిగా నిషేధం అని తెలిపారు. ప్రజలు పట్టణ పరిశుభ్రత కు సహకరించాలని కోరారు. పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దెందుకు ప్రతీ పౌరుడు సహకరించాలని పిలుపునిచ్చారు. పట్టణంలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో దాదాపు 300 కేజీ పైగా ప్లాస్టిక్ కవర్లు సీజ్. పట్టణంలో పలు ప్రాంతాల్లో, దుకాణాలలో బృందాలుగా సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. దాదాపు 3క్వింటాళ్ళ పైగా ప్లాస్టిక్ సీజ్ చేశారు. మళ్ళీ పునరావృతమైతే భారీ జరిమానా తో పాటు ట్రేడ్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. సీజ్ చేసిన ప్లాస్టిక్ మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. ఈ కార్యక్రమం లో రెవెన్యూ ఇన్స్పెక్టర్ మల్లికార్జున,పోలీస్ సిబ్బంది శానిటరీ, ఇతర సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# విష జ్వరాల నుండి రాయచోటి ప్రజలను కాపాడండి

- డ్రైనేజీ వాటర్ తో నిండిన మాండవ్య నదిని శుభ్రపరచండి
- మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేసిన న్యాయవాదుల సంఘం



రాయల్ జర్నలిజం ( రాయచోటి ) జూలై 20 : విష జ్వరాలకు కారణమైన దోమలను ఉత్పత్తి చేసే కేంద్రంగా మారిపోయిన మాండవ్య నదిని శుభ్రం చేసి రాయచోటి పట్టణానికి చెందిన డ్రైనేజీ నీరు మాండవ్య నదిలో నిలవకుండా చేసి విష జ్వరాల బారి నుండి రాయచోటి వాసులను రక్షించడానికి తగిన చర్యలు తీసుకోవాలని భారత న్యాయవాదుల సంఘం రాయచోటి మున్సిపల్ కమిషనర్ ను శనివారం కలిసి విజ్ఞప్తి చేశారు. భారత న్యాయవాదుల సంఘం కడప ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి ఈశ్వర్ అన్నమయ్య జిల్లా న్యాయవాదుల సంక్షేమ సమితి అధ్యక్షులు రాజకుమార్ రాజు ప్రధాన కార్యదర్శి ఆనంద్ కుమార్ ఐ. ఏ .ఎల్ న్యాయవాదులు %ూ%.రెడ్డయ్య, హుమాయోన్ భాష చిన్నయ్య అక్బర్ అలీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రోజుల క్రితమే మాండవ్య నదీ పరివాహక ప్రాంతాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను తెలుసుకున్నట్లు వారు కమీషనర్ కు తెలిపారు . రాయచోటి పట్టణంలోని 30 వేల కుటుంబాల డ్రైనేజీ అంతా కూడా మాండవ్య నదిలో వెళుతోందని దానిని రాయచోటి పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలోని చల్లంపల్లి సమీపంలో నదికి ఇరువైపులా ఉన్న కాలువలు ద్వారా వెళ్లిపోయేటట్లు చేయాలని లేనిపక్షంలో ప్రజలు డెంగ్యూ మలేరియా విష జ్వరాల బారిన పడి లక్షలాది రూపాయలు ఖర్చు చేసుకోలేక ప్రాణాలు కోల్పోతారని వారు తెలిపారు. నదికి ఇరువైపులా ఉన్న కాలువలు పూడికలతో నిండిపోవడం వలన రాయచోటి డ్రైనేజీ నీరంతా కూడా మాండవ్య నదిలో చెరువుల్లాగా తయారైందని కాలువలను తక్షణం కూడికలు తీయించి డ్రైనేజీ నీటిని పట్టణానికి దూరంగా వదిలేయాలని వారు విజ్ఞప్తి చేశారు . డ్రైనేజ్ వాటర్ మాండవ్య నదిలోనికి వెళ్లకుండా చర్యలు తీసుకుని దోమల నివారణ తక్షణం చేపడతామని మున్సిపల్ కమిషనర్ న్యాయవాదులకు హామీ ఇచ్చారు .అదేవిధంగా రాయచోటి పట్టణ డ్రైనేజ్ వాటర్ ను శుభ్రపరిచి నదిలోనికి వదిలేసే ప్రాజెక్టులను భవిష్యత్తులో తీసుకురావడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని ఆయన న్యాయవాదులకు తెలియజేశారు.

# కుష్టి వ్యాధిని తరిమికొడదాం

## జిల్లా కుష్టు వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి



రాయల్ జర్నలిజం (ఎర్రావారి పాలెం) జూలై 20 : కుష్టి వ్యాధిని తరిమికొడదామని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని శనివారం ఎర్రావారి పాలెం లోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం నందు కుష్టి వ్యాధుల నివారణ పై అవగాహన కార్యక్రమాన్ని జిల్లా కుష్టి వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ శ్రీనివాసరెడ్డి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది కుష్టు వ్యాధి పైఇంటింటి సర్వే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని వివరించారు. ఈనెల 18వ తేదీ నుండి ఆగస్టు రెండో తేదీ వరకు ఇంటింటా కుష్టి వ్యాధి సర్వే కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరికి ఈ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కుష్టు వ్యాధి మైక్రో బ్యాక్టీరియం లేప్రే అనే సూక్ష్మ క్రిమి వల్ల వచ్చే అతి సామాన్యమైన వ్యాధి అని గుర్తు ఈ వ్యాధి చర్మానికి నరాలకు షోకి నెమ్మదిగా పెరిగి వ్యాధి లక్షణాలు ఈ వ్యాధి వంశ పారంపర్యం వచ్చే వ్యాధి ఈ వ్యాధి నిర్మూలించేందుకు మనమందరం సంఘటితంగా కృషి చేస్తామన్నారు. మచ్చలను అశ్రద్ధ చేయువద్దని తెలియజేశారు.శరీరంలో పూర్తిగా పరీక్ష చేసుకోవాలన్నారు. ఈ వ్యాధి లక్షణాలు బయటపడిన వెంటనే ఆరు నెలలు 12 నెలలు పాటు యాంటీబయాటిక్స్ కలయక తో చికిత్స అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రావారి పాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ లేనా కుమార్, డిప్యూటీ డెమో కిరణ్ కుమార్, హెల్త్ ఎడ్యుకేటెడ్ కృష్ణమ్మ, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులువిద్యార్థులు పాల్గొన్నారు.

# అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ ని కలిసిన చమర్తి జగన్మోహన్ రాజు



రాయల్ జర్నలిజం(రాయచోటి)జులై 20:అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ని శనివారం టిడిపి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు మర్యాదపూర్వకంగా కలిసి కలెక్టర్ ను సన్మానించి మొక్కను అందజేశారు. అనంతరం జగన్మోహన్ రాజు జిల్లా వ్యాప్తంగా ఉన్న కొన్ని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్చించారు. ముఖ్యంగా జిల్లాలోని రాజంపేట నియోజకవర్గం తోపాటు అన్ని నియోజకవర్గాలల్లో ఇసుక కొరత లేకుండా, ఇసుక నిల్వ కేంద్రాలలో ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జగన్మోహన్ రాజు జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. జగన్మోహన్ రాజు వెంట వీరబల్లి టిడిపి మండల అధ్యక్షులు భానుగోపాల్ రాజు, టిడిపి నాయకులు భాస్కర్ రాజు, శ్రీనివాస రాజు, ఆంజనేయులు, నాగప్ప నాయుడు, వీరామృత నాయుడు, తదితరులు ఉన్నారు.

# గురు పౌర్ణమి వేడుకలకు సర్వం సిద్ధం ఆలయ ధర్మకర్త లక్ష్మీపతి



రాయల్ జర్నలిజం ( రామసముద్రం ) జులై 20 : మండల కేంద్రంలోని శిరిడి సాయిబాబా ఆలయంలో ఆది వారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహిం చునట్లు ఆలయ ధర్మకర్త లక్ష్మిపతి అర్చకులు తిన్నిలిస్వామి మరియు కమిటీ సభ్యులు తెలిపారు. వారు మాట్లాడుతూ గురుపౌర్ణమి సందర్భంగా ఉదయం నుండి ఆలయంలో ప్రత్యేక పూజలు, భక్తులకు తీర్థ ప్రసాదాలు అన్నదానం చేయనట్లు తెలిపారు.సాయంత్రం ఉత్సవమూర్తి విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు.భక్తులు తరలివచ్చి ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని వారు కోరారు.

# ఎమ్మెల్యే చొరవతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

## టీడీపీ మండల అధ్యక్షుడు విజయ్ కుమార్ గౌడ్



రాయల్ జర్నలిజం ( రామసముద్రం) జులై 20 : మండలంలోని శీతరగానిపల్లె గ్రామానికి ఎమ్మెల్యే షాజహాన్ బాషా చొరవతో రోడ్డుకు మరమ్మతు పనులను ప్రారంభమయ్యాయి. శనివారం టిడిపి మండలాధ్యక్షులు విజయకుమార్ గౌడు రోడ్డుకు భూమిపూజ చేసి, ఎక్స్ కవేటర్ తో పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే షాజహాన్ బాషా మండల పర్యటన సందర్భంగా సీతరగానిపల్లి గ్రామస్తులు రోడ్డు మంజూరు చేయాలని తన దృష్టికి తీసుకు రాగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే మంజూరు చేయిస్తానని మాట ఇవ్వడం జరిగిందన్నారు. మాట ఇచ్చిన వారం రోజుల్లోనే మండల పరిషత్ నిధులు రూ. 4లక్షలు మంజూరు చేయించారని తెలిపారు. ఎన్నో ఏళ్ళుగా ఎదురుచూస్తున్న రోడ్డుకు నిధులు మంజూరవ్వడంతో గ్రామస్థులు ఎమ్మెల్యే షాజహాన్ బాషా, విజయ్ కుమార్ గౌడ్, సర్పంచ్ కవితమ్మలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యాక్రమంలో టీడీపీ నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి చొరవతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



రాయల్ జర్నలియం (రాయచోటి) జులై 20 : రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డి చొరవతో గాలివీడు మండలం, ఎగువ గొట్టి వీడు గ్రామంలో ప్రజలకు శాశ్వత మంచి నీటి సమస్య పరిష్కరించడం జరిగింది. గత కొన్నేళ్లుగా ఎగువ గొట్టివీడు కస్పాలోని ప్రజలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, త్రాగునీటి కోసం నానా ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ సమస్యను గ్రామస్తులు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారి దృష్టికి తీసుకొనిరాగా వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి గతంలో వేసిన బోర్ నుంచి కొత్త పైప్ లైన్ కనెక్షన్ ఇప్పించి శనివారం గ్రామానికి నీటి సరఫరా చేయడం జరిగింది. దీంతో గ్రామ ప్రజలు పాఠశాల విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. అన్నమయ్య జిల్లాలో ప్రజల సమస్యల పరిష్కారానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చేస్తున్న కృషికి జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాయల్ జర్నలిజం ద్విభాషా దినపత్రిక ROYAL JOURNALISM

# బడ్జెట్‌లో విద్యారంగానికి.. కేటాయింపులు పెంచాల్సిందే..!

అమరావతి : 21వ శతాబ్దంలో భారతీయ యువత ప్రపంచంతో పోటీ పడాలని వారికి నాణ్యమైన విద్యను అందించాలని, వారిలో సృజనాత్మకతను పెంచాలని భారత ప్రభుత్వం 29 జూలై 2020 రోజున నూతన జాతీయ విద్యా విధానం-2020 ను తీసుకొచ్చింది.దీని ప్రకారం భారతదేశ జీడీపీలో విద్యారంగానికి కనీసం 6% నిధులను కేటాయించాలి. గత ఆర్థిక సంవత్సరంలో భారత ప్రభుత్వ బడ్జెట్లో కేవలం 2.9% నిధులు (1,12,899 కోట్లు) మాత్రమే కేటాయించడం శోచనీయం.ప్రపంచంలో నాణ్యమైన విద్యను అందించే దేశాలు వాటి బడ్జెట్లో 6 % కన్నా ఎక్కువ నిధులనే కేటాయిస్తున్నాయి. ఉదాహరణకి నార్వే, చీలి దేశాల్లో 6.6%, ఇజ్రాయిల్, న్యూజిలాండ్ లు 6.2% ఇంగ్లాండ్ 6.1% అమెరికా 6% నిధులు కేటాయించి నాణ్యమైన విద్యను అందిస్తున్నాయి. స్వతంత్ర భారతంలో ఇప్పటివరకు విద్యారంగానికి ఆరు శాతం పైగా నిధుల కేటాయింపు ఎప్పుడూ జరుగలేదు. ఇది పాలకుల చిత్తశుద్ధికి నిదర్శనం. ఇప్పటికైనా పాలకులు రాబోయే బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి ప్రజలకు నాణ్యమైన విద్యను అందిస్తారని ఆశిద్దాం.

**అతి పెద్ద విద్యా వ్యవస్థే కానీ..**

ప్రజల జీవన ప్రమాణాలు వారి సామాజిక ఆర్థిక స్థితిగతులు వారికి అందించే విద్యపై మాత్రమే ఆధారపడి ఉంటాయి. 1964 లో కొఠారి కమిషన్ ప్రతిపాదన ప్రకారం దేశ జీడీపీలో విద్యారంగానికి కనీసం 6% బడ్జెట్ కేటాయింపులు చేయాలని సూచించారు. 1986 జాతీయ విద్యా విధానం కూడా కొఠారి కమిషన్ చేసిన ప్రతిపాదనను అంగీకరించింది. ఈ ప్రతిపాదన ఇప్పటికే అమలు కాలేదు. 26.5 కోట్ల మంది విద్యార్థులు,14.9 లక్షల పాఠశాలలు మరియు 95 లక్షల మంది ఉపాధ్యాయులతో భారతీయ విద్యా వ్యవస్థ ప్రపంచంలోనే అతిపెద్ద విద్యా వ్యవస్థగా గుర్తింపు పొందింది. అతి పెద్ద ప్రజాస్వామిక దేశం అతిపెద్ద విద్యావ్యవస్థలో ఉన్న మనం విద్యారంగంలో అనేక విద్యాసంస్కరణలు తీసుకొచ్చినప్పటికీ ప్రజలకు పూర్తి స్థాయిలో నాణ్యమైన విద్య అందించడంలో సఫలీకృతం కాలేకపోయాం.

**విద్యలో మన వైఫల్యానికి అదే కారణం**

నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ ప్రకారం భారతదేశంలో నాణ్యమైన విద్య అందించకపోవడానికి ప్రధాన కారణాలుగా విద్యారంగానికి సరైన బడ్జెట్ కేటాయింపులు లేకపోవడం, దేశంలో 33 శాతం టీచర్లు అర్హత కలిగిన వారు అందుబాటులో లేకపోవడం, ఆధునిక సాంకేతిక నైపుణ్యాలు టీచర్లు అందిపుచ్చుకోకపోవడం, మారుతున్న సమాజ అవసరాలకు అనుగుణంగా ఆధునిక ప్రపంచంలో విద్యార్థులు రాణించేలా వారిలో సృజనాత్మకతను పెంచేలా కరికులం లేకపోవడం, దేశంలోని మెజారిటీ బడుల్లో మౌలిక సౌకర్యాలు కల్పించకపోవడం ప్రధానంగా మంచినీరు, పారిశుధ్య నిర్వహణ, విద్యుదీకరణ తరగతి గదులు చాలినంత అందుబాటులో లేకపోవడం. వీటన్నింటతీ మూల కారణం బడ్జెట్లో విద్యారంగానికి నిధులు అధికంగా కేటాయించకపోవడం.



**రెండూ భాషల్లోనూ చదవరాదు**

అసర్‌రిపోర్ట్ -2023 ప్రకారం భారత దేశంలోనీ 26 రాష్ట్రాల్లో 28 జిల్లాల్లో 34,745 మంది 14-18 వయసు గల వారిని సర్వే చేస్తే వారిలో 42.7% ఇంగ్లిష్‌లో కనీసం రెండు వాక్యాలు కూడా చదువలేకపోతున్నారు. 2 వతరగతి పాఠ్య పుస్తకాలను వారి ప్రాంతీయ భాషల్లో చదవడం లేదు. కేవలం 43% మాత్రమే చతుర్విధ ప్రక్రియలు చేయగలుగుతున్నారు. ఈ రిపోర్టు ఆధారంగా విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు లోపించాయని మనకు స్పష్టంగా తెలుస్తుంది. 86.8% విద్యార్థులు మాత్రమే ఏదో ఒక కాలేజీలో కానీ స్కూల్లో గాని చదువుతున్నారు. మిగతావారు చదువుకోవడం లేదు. ప్రఖ్యాత అమెరికా సంస్థ %దీూ౦% గ్రూప్, వార్టన్ స్కూల్ ఆఫ్ యూనివర్సిటీ తయారుచేసిన వార్షిక నివేదిక ప్రకారం నాణ్యమైన విద్యను అందించడంలో అమెరికా, ఇంగ్లాండ్ మొదటి రెండు స్థానాల్లో ఉండగా భారతదేశం 32వ స్థానంలో ఉంది. ఈ సర్వేను 78 దేశాల్లో వేల మంది ప్రజలతో ఈ సంస్థ నిర్వహించడం విశేషం.

**సరైన విద్య లేకే.. విద్యార్థుల వలస**

భారత ప్రభుత్వం పార్లమెంట్లో అధికారికంగా తెలిపిన వివరాల ప్రకారం భారతదేశం నుండి ఉన్నత చదువులకు వివిధ దేశాలకు వెళ్తున్న విద్యార్థులు ప్రతి సంవత్సరం పెరుగుతున్నారు. గతంతో పోలిస్తే 2023లో 68% పెరుగుదలతో 7,50,365 మంది విద్యార్థులు ఉన్నత చదువుల కోసం వేరే దేశాలకు తరలి వెళ్లారు. ఒక సర్వే ప్రకారం ఇది ఇలాగే కొనసాగితే 2024 సంవత్సరంలో భారతదేశం నుండి 18 లక్షల విద్యార్థులు ఉన్నత విద్యాభ్యాసం కోసం వేరే దేశాలకు వెళ్లే అవకాశం ఉంది. దేశంలో ప్రపంచ స్థాయి నాణ్యమైన విద్య అందుబాటులో లేకపోవడంతో ఈ విధంగా విద్యార్థులు వేరే దేశాలకు వెళ్తున్నారు.

**నాణ్యమైన విద్య ప్రభుత్వ బాధ్యత**

సాధారణంగా కేంద్ర బడ్జెట్ ఫిబ్రవరి ఒకటో తేదీన ప్రవేశపెడతారు. సార్వత్రిక ఎన్నికలు వల్ల ఫిబ్రవరిలో మధ్యంతర బడ్జెట్ ప్రవేశ పెట్టడం జరిగింది. నూతనంగా కొలువుతీరిన కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ఈనెల 23న పార్లమెంటులో ప్రవేశపెట్టనుంది. దేశంలోని బడుగు బలహీన వర్గాలకి నాణ్యమైన విద్యను అందించే బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. ఇప్పటికైనా పాలకులు రాబోయే బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి ప్రజలకు నాణ్యమైన విద్యను అందిస్తారని, ప్రపంచ స్థాయి విద్యను అందుకోవడం కోసం భారతీయ విద్యార్థులు పాశ్చాత్య దేశాలకు వలస వెళ్లడాన్ని నియంత్రిస్తారని ఆశిద్దాం.

# ఇది జీవన్మరణ సమస్య: ముఖ్యమంత్రి ఆందోళన

న్యూఢిల్లీ : అస్సాంలో ముస్లిం జనాభా గత ఏడు దశాబ్దాల్లో 40 శాతానికి పెరిగిందని, ఇది తమకు జీవన్మరణ సమస్యగా మారిందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ అన్నారు.అసోం రాష్ట్రానికి చెందిన తనకు ముస్లిం జనాభా లో చోటు చేసుకున్న ఈ మార్పు పెద్ద జీవన్మరణ సమస్య అని వ్యాఖ్యానించారు. "1951లో అసోంలో 12 శాతంగా ఉన్న ముస్లిం జనాభా ఇప్పుడు 40 శాతానికి చేరింది. ఇది నాకు రాజకీయ సమస్య కాదు. ఇది నా లాంటి వారికి జీవన్మరణ సమస్య" అని ఆయన రాంచీలో విలేకరులతో అన్నారు.బంగ్లాదేశ్ నుంచి జార?ండ్ రాష్ట్రంలోకి అక్రమ వలసదారుల రాకను అరికట్టడంలో జారండ్ లో హేమంత్ సొరేన్ నేతృత్వంలోని జేఎంఎం ప్రభుత్వం విఫలమైందని అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ ఆరోపించారు. జారండ్ లో ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. "చొరబాటుదారులను వెనక్కు పంపే విషయంలో జార?ండ్ హైకోర్టు ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు కూడా జారీ చేసింది. అయినా ప్రభుత్వం నుంచి స్పందన లేదు. చొరబాటుదారులను ఎందుకు వెనక్కు పంపించలేకపోతోందో జారండ్ లోని జేఎంఎం ప్రభుత్వం స్పష్టం చేయాలి. చొరబాటుదారులను వెనక్కు పంపించే పనిని నేను అస్సాంలో ప్రతిరోజూ చేస్తాను' అని శర్మ తెలిపారు.శర్మ వ్యాఖ్యలపై అసోం కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ మండిపడ్డారు.



" అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ మతిమరుపు వ్యాధితో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. రెండు నెలల క్రితం అస్సాంలోని మైనారిటీలు అధికంగా ఉండే ప్రాంతాల్లో ఆయన డ్యాన్స్ చేస్తూ, పాటలు పాడుతూ కనిపించారు. బీజేపీకి ఓట్లు అవసరమైనప్పుడు అది ఆయనకు జీవన్మరణ సమస్యలా కనిపించదు" అని గౌరవ్ గొగోయ్ విమర్శించారు. లోక్ సభ ఎన్నికల సందర్భంగా అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ అసోంలో చేసిన ప్రచారాన్ని ప్రస్తావిస్తూ గొగోయ్ ఎక్స్‌లో పై విమర్శలు చేశారు. జార?ండ్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి సోనాల్ శాంతి కూడా శర్మ వ్యాఖ్యలను తప్పుబ ట్టారు. వరదల సమయంలో అసోం ప్రజలకు ఉపశమనం కలిగిం చడానికి బదులుగా, జారండ్ లో హింసను ప్రేరేపించడానికి అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ ప్రయత్నిస్తున్నారని సోనాల్ శాంతి అన్నారు.

# బంగ్లాదేశ్‌లో కర్ఫ్యూ- రంగంలోకి సైన్యం.. నిరసనలకు 109మంది బలి!



న్యూఢిల్లీ : 1971లో పాకిస్థాన్‌తో జరిగిన విమోచన యుద్ధంలో పాల్గొన్న సైనికుల పిల్లలతో సహా ప్రభుత్వ ఉద్యోగాల్లో సగానికి పైగా నిర్దిష్ట వర్గాల రిజర్వేషన్ కోసం ప్రవేశపెట్టిన కోటా విధానానికి వ్యతిరేకంగా బంగ్లాదేశ్?లో జరుగుతున్న నిరసనలు తీవ్రస్థాయికి చేరాయి.పరిస్థితులు చెయ్యి దాటిపోవడంతో ప్రధాని షేక్? హసీనా ప్రభుత్వం ఆర్మీని రంగంలోకి దింపింది. దేశవ్యాప్తంగా కర్ఫ్యూని విధించింది.కర్ఫ్యూ నేపథ్యంలో రాజధాని నగరం ఢాకాలో బహిరంగ సభలపై నిషేధం పడింది. ర్యాలీలను సైతం నిషేధించారు. ప్రజా భద్రత కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్టు బంగ్లాదేశ్? అధికారులు వెల్లడించారు. అయినప్పటికీ నిరసనకారులు వెనక్కి తగ్గలేదు! భారీ ఎత్తున్న రోడ్ల మీదకు వచ్చి నిరసనలు వ్యక్తం చేశారు. ఫలితంగా పలు ప్రాంతాల్లో పోలీసులు- ఆందోళనకారుల మధ్య ప్రతిష్ఠంభన కనిపించింది.బంగ్లాదేశ్?లో నిరసనలు చేస్తున్న వారిలో ఎక్కువగా విద్యార్థులే ఉన్నారు. కోటా వ్యవస్థను తీసివేయాలని డిమాండ్? చేస్తూ.. షేక్? హసీనా 15ఏళ్ల ప్రభుత్వానికి సవాలు విసురుతున్నారు. నిరసనలను నియంత్రించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషిచేస్తున్నా, అవి మాత్రం రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి.బంగ్లాదేశ్? నిరసనల్లో ఇప్పటివరకు 109మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 50మందికిపైగా మంది ప్రజలు ఒక్క శుక్రవారమే మరణించారు. వీరిలో చాలా మంది పోలీసుల తూటాలకు ప్రాణాలు విడిచిన వారే ఉన్నారు. గురువారం మరో 25మంది ప్రాణాలు కోల్పోయారు. విద్యార్థులపై కాల్పుల విషయంపై ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల చీఫ్? వోల్కర్? టర్క్? స్పందించారు. విద్యార్థులపై దాడులు చేయడం షాకింగ్?, ఆమోదయోగ్యం కాని విషయం అన్నారు.కానీ బంగ్లాదేశ్?లో పరిస్థితులు రోజురోజుకు ఆందోళనకరంగా మారుతున్నాయి. నర్సింగ్డి జిల్లాలోని జైలులోకి చొరబడిన నిరసనకారులు ఖైదీలను విడుదల చేశారు. అనంతరం ఆ జైలుకు నిప్పంటించారు. వందకుపైగా మంది ఖైదీలు తప్పించుకున్నట్టు అధికారులు భావిస్తున్నారు.ఇక ప్రభుత్వ ఆస్తులే లక్ష్యంగా నిరసనకారులు పేట్రేగిపోతున్నారు. పోలీసు భవనాలు, ప్రభుత్వ కార్యాలయాలను ధ్వంసం చేస్తున్నారు.ఈ నిరసనలకు మూలమైన 'కోటా' వ్యవస్థపై పలు ఆరోపణలు వస్తున్నాయి. షేక్? హసీనా ప్రభుత్వానికి మద్దతుగా నిలిచిన వారికే ఈ కోటాలో ప్రయోజనాలు జరుగుతాయని అంటున్నారు. ఇంతకాలం తనకు విధేయులుగా నిలిచిన వారికి రివార్డులు ఇచ్చేందుకే ఈ కోటా వ్యవస్థను షేక్? హసీనా తీసుకొచ్చినట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.మరోవైపు ఈ కోటాను ఆ దేశ సుప్రీంకోర్టు సస్పెండ్? చేసింది. కానీ సుప్రీంకోర్టు తీర్పును ప్రభుత్వం సవాలు చేసింది.షేక్ హసీనా 2009 నుంచి బంగ్లాదేశ్?ని పాలిస్తున్నారు. ఇటీవలే ముగిసిన ఎన్నికల్లో, ఎలాంటి విపక్షం లేకుండా మరోసారి విజయం సాధించారు.

**భారత్‌కు భారతీయ విద్యార్థులు..**

బంగ్లాదేశ్‌లో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అక్కడ జీవిస్తున్న భారతీయులు, చదువుకుంటున్న విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని విదేశాంగశాఖ స్పష్టం చేసింది. కాగా నిరసనల నుంచి బయటపడేందుకు భారత విద్యార్థులు అన్ని విధాలుగా కృషి చేస్తున్నారు. ఏది దొరికితే అది పట్టుకుని సరిహద్దును దాటుతున్నారు. ఇప్పటికే 300మంది విద్యార్థులు భారత్?కు చేరుకున్నారు.ఈ 300 మందిలో చాలా మంది ఎంబీబీఎస్? చదువుకుంటున్న వారే ఉన్నారు. వీరందరు యూపీ, హరియాణా, మేఘాలయ, జమ్ముకశ్మీర్?కి చెందినవారు.మంగళవారం వరకు పరిస్థితులు బాగానే ఉన్నట్టు, కానీ ఆ తర్వాత ఒక్కసారిగా ఉద్రిక్తత పెరిగినట్టు విద్యార్థులు చెబుతున్నారు. అందుకే బంగ్లాదేశ్?ని తాత్కాలికంగా వదిలి వచ్చినట్టు స్పష్టం చేశారు.

# పాడేరు ఏజెన్సీ అతలాకుతలం..30 గ్రామాలకు రాకపోకలు బంద్



అమరావతి: అల్లూరి సీతారామరాజు జిల్లాలో భారీ వర్షం కురుస్తోంది. రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వాన పడుతోంది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి.దీంతో పాడేరు ఏజెన్సీలో స్కూళ్లకు సెలవులు ప్రకటించారు. రాయిగడ్డ వంతెన వద్ద ఉన్న వాగు ఒక్కసారిగా పొంగింది. దీంతో వంతెనపై నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. ఈ ఎఫెక్ట్‌తో 20 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. హుకుంపేట మండలం తడిగిరిలో వాగు ఉగ్రరూపం దాల్చింది. దీంతో 10 గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. పెదబయలు మండలంలో కించవాగు ఉధృతిగా ప్రవహిస్తోంది. రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. వర్షాలు మరో రెండు రోజులు పాటు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించడంతో కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర సేవల కోసం 08935 293120, 293448కు ఫోన్ చేయాలని సూచించారు.అటు ఏలూరు జిల్లాలోనూ భారీ వర్షం కురిసింది. వేలేరుపాడులో 12 మండలాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. వర్షం దెబ్బకు పూరిళ్లు కొట్టుకుపోయాయి. వేరుశనగ, జామాయిల్ పంటలు నీట మునిగాయి. దీంతో తీవ్ర నష్టం వాటిల్లింది.

# జూరాల 5 గేట్లు ఎత్తివేత.. పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ



గద్వాల : ఎగువ ప్రాజెక్టుల నుండి వరద ప్రవాహం కొనసాగుతుండడంతో జూరాల వద్ద కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు వరద ప్రవాహం పెరగడంతో ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులలో గేట్లు ఎత్తివేయడంతో భారీ వరద నీరు జూరాల ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది.శనివారం ఉదయం జూరాలకు సుమారు 76,238 క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదైంది. జూరాల జలాశయం నుంచి 5 గేట్ల ద్వారా 19,680 క్యూసెక్కులు, జల విద్యుత్ ద్వారా 36,491 క్యూసెక్కుల చొప్పున మొత్తం 60,986 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయడంతో కృష్ణమ్మ శ్రీశైలం వైపు పరుగులు తీస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుత 7.682 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. అలాగే పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లకు గాను ప్రస్తుత నీటిమట్టం 317.520 మీటర్లు ఉన్నాయి.

# తాడిపత్రికి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి.. ఉద్రిక్తత



అనంతపురం : జిల్లా తాడిపత్రిలో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి మధ్య గొడవలు ఉన్న సంగతి తెలిసిందే.అయితే జేసీ ప్రభాకర్ రెడ్డి శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించి కేతిరెడ్డి పెద్దారెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడిపత్రికి వస్తే గుడ్డలూడదీసి కొడతామని జేసీ ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు. ఈ నేపథ్యంలో కేతిరెడ్డి పెద్దారెడ్డి ఈ ఉదయం తాడిపత్రి వెళ్లారు. ఎన్నికల సమయంలో తాడిపత్రిలో జరిగిన ఘర్షణ నేపథ్యంలో పెద్దారెడ్డికి బెయిల్ మంజూరు అయింది. ఇందుకు సంబంధించి తాడిపత్రి పోలీస్ స్టేషన్‌కు ఆయన వెళ్లారు. ఈ నేపథ్యంలో తాడిపత్రి బస్టాండ్ సమీపంలో 2 గంటలపాటు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీస్ స్టేషన్ లో పని అయిపోయిన తర్వాత పెద్దారెడ్డి అనంతపురం వెళ్లిపోయారు.అయితే జేసీ ప్రభాకర్ రెడ్డిపై కేతిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడిపత్రి జేసీ జాగీరా అని ప్రశ్నించారు. తనను బహిష్కరించడానికి జేసీ ఎవరని నిలదీశారు. తమ అంతుచూస్తామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. జేసీకి సైతం కుటుంబ సభ్యులు ఉన్నారనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని సూచించారు. జేసీ వాహనాలపై తాను ఫిర్యాదు చేయలేదని పెద్దారెడ్డి పేర్కొన్నారు.

# తెలంగాణ స్కిల్స్ వర్సిటీ ఏర్పాటుకు సీఎం రేవంత్ కీలక ఆదేశాలు



హైదరాబాద్ : తెలంగాణ స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటుపై ఈ బడ్జెట్ అసెంబ్లీ సమావేశాల్లోనే బిల్లు ప్రవేశపెట్టేందుకు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్? రెడ్డి అధికారులను ఆదేశించారు.పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థినీ విద్యార్థులకు నైపుణ్యాల శిక్షణను అందించి ఉద్యోగ అవకాశాలు కల్పించే సమున్నత లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తుందని అన్నారు. ఈ యూనివర్సిటీ ఏర్పాటుకు, నిర్వహణకు ఎంత ఖర్చు అయినా భరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.

**తెలంగాణ స్కిల్స్ యూనివర్సిటీ పేరు ఖరారు :** స్కిల్ యూనివర్సిటీపై సచివాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఢిల్లీ, హర్యానాలో ఉన్న స్కిల్ యూనివర్సిటీలను పరిశీలించి, తెలంగాణలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు రాష్ట్ర పరిశ్రమల విభాగం నమూనా ముసాయిదాను తయారు చేసింది. ఈ యూనివర్సిటీలో నిర్వహించే కోర్సులు, వాటి వ్యవధి, నిర్వహణకు అవసరమయ్యే మౌలిక వసతులు, నిర్వహణకు అవసరమయ్యే నిధులు, వివిధ కంపెనీల భాగస్వామ్యంపై పరిశ్రమల శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ప్రదర్శించారు. కొత్త యూనివర్సిటీ 'తెలంగాణ స్కిల్స్ యూనివర్సిటీ' అని పేరు పెట్టాలని నిర్ణయం తీసుకున్నారు.

**17 కోర్సులు, ఏటా 20వేల మందికి శిక్షణ :** ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో (పీపీపీ మోడల్లో) స్కిల్స్ యూనివర్సిటీ నెలకొల్పుతారు. లాభాపేక్ష లేకుండా స్వయం ప్రతిపత్తి ఉండేలా దీనిని ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. మూడు నాలుగేండ్ల కాల వ్యవధి ఉండే డిగ్రీ కోర్సులతో పాటు ఏడాది డిప్లొమా, మూడు నుంచి నాలుగు నెలల వ్యవధి ఉండే సర్టిఫికెట్ కోర్సులు ఇందులో నిర్వహిస్తారు.తెలంగాణలో అభివృద్ధి చెందుతున్న వివిధ రంగాలు, పరిశ్రమల భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులను ఎంపిక చేశారు. మొత్తం 17 ప్రాధాన్య రంగాలను గుర్తించారు. ఫార్మా, కన్‌స్ట్రక్షన్, బ్యాంకింగ్ ఫైనాన్స్ సర్వీసెస్, ఈ కామర్స్ అండ్ లాజిస్టిక్స్, రిటైల్, యానిమేషన్ విజువల్ ఎఫెక్ట్స్ గేమింగ్ అండ్ కామిక్స్..తొలుత ఆరు రంగాల్లో ఉపాధి అవకాశాలున్న కోర్సులను ప్రవేశ పెడుతారు. ప్రతి కోర్సును సంబంధిత రంగంలో పేరొందిన ఒక కంపెనీ భాగస్వామ్యం ఉండేలా అనుసంధానం చేస్తారు. అందుకు సంబంధించి ప్రభుత్వం కంపెనీలతో ఎంవోయూ చేసుకుంటుంది. తొలి ఏడాది రెండు వేల మందితో ప్రారంభించి, క్రమంగా ఏడాదికి 20 వేల మందికి ఈ కోర్సుల్లో అడ్మిషన్లు కల్పిస్తారు.

**హైదరాబాద్‌లోనే క్యాంపస్ :** హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ క్యాంపస్ తోపాటు జిల్లా కేంద్రాల్లో ప్రాంతీయ ప్రాంగణాలు (శాటిలైట్ క్యాంపస్‌లు) ఏర్పాటు చేయాలనే చర్చ జరిగింది. జిల్లా కేంద్రాల్లో శాటిలైట్ క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తే చేరే వారి సంఖ్య తక్కువగా ఉంటుందని, అందరూ హైదరాబాద్ క్యాంపస్ లోనే చేరేందుకు పోటీ పడుతారని ముఖ్యమంత్రి అన్నారు.అందుకే హైదరాబాద్ లోనే అందరికీ శిక్షణను అందించేలా ఏర్పాట్లు చేయాలని, ఈఎస్సీతో పాటు న్యాక్ క్యాంపస్ ఉపయోగించుకోవాలని, అవసరమైన మౌలిక వసతి సదుపాయాలుండే వివిధ ప్రాంగణాలను గుర్తించాలని సూచించారు. భూదాన్ పోచంపల్లిలో ఉన్న స్వామి రామానంద తీర్థ రూరల్ ఇన్స్టిట్యూట్ లో ఉన్న కోర్సులు, అక్కడున్న సదుపాయాలను అధికారులు స్వయంగా వెళ్లి పరిశీలించాలని సీఎం ఆదేశించారు.

**కచ్చితంగా ఉపాధి కల్పించేలా :** డిమాండ్ ఎక్కువగా ఉన్న రంగాలపైనే ఎక్కువ దృష్టి పెట్టాలని, రాష్ట్రంలో ఫార్మా కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నందున, అటువంటి కోర్సుల్లో ఎక్కువ సీట్లు ఉండాలని చెప్పారు. ఈ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు ఉండాలని, ఇందుకు సంబంధించి ముందుగానే వివిధ కంపెనీలతో చర్చించాలని సీఎం అధికారులను ఆదేశించారు. మిగతా యూనివర్సిటీలు అనుసరించిన విధానాలను పరిశీలించి కొత్త యూనివర్సిటీ సంస్థాగత నిర్మాణాన్ని తయారు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా పలు మార్పులు చేర్పులు చేసి ముసాయిదాను సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు.

# తుఫాన్లకు పేర్లు ఎవరు పెడతారు? నియమ నిబంధనలు ఏంటి?

సాధారణంగా అప్పుడప్పుడు బంగాళాఖాతంలో తుఫాన్లు ఏర్పడుతుంటాయి. కొన్ని తుఫాన్లు బీభత్సం సృష్టిస్తుంటాయి. ఈ తుఫాన్ల కారణంగా ఎంతో ప్రాణ నష్టంతో పాటు ఆస్తినష్టం కూడా సంభవిస్తుంటుంది.అయితే తుఫాన్లు వచ్చిన ప్రతి సారి వాటి పేర్లు కొత్తగా ఉంటాయి. తుఫాన్ల పేర్లు వింటేనే విచిత్రంగా ఉంటాయి. అసలు ఈ తుఫాన్లుకు పేర్లు ఎవరు పెడతారు..? ఎలా పెడతారనే ప్రశ్న చాలా మందిలో వస్తుంటుంది. ఇటీవల తుఫాన్లు దేశ వ్యాప్తంగా అనే రాష్ట్రాల్లో సంభవించి తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రస్తుత తుఫానుకు 'సిక్కోలు'గా నామకరణం చేశారు.తుఫానుల తీవ్రతను చెప్పేందుకు ప్రపంచవాతావరణతోపాటు ఆర్థిక, సామాజిక కమిషన్ ఆసియా, పసిఫిక్ ప్యానెల్‌ను ఏర్పాటు చేసింది. ఇలా ప్రపంచవ్యాప్తంగా మొత్తం ఆరు వాతావరణ కేంద్రాలు పనిచేస్తున్నాయి. వీటితోపాటు ఐదు ప్రాంతీయ ఉష్ణమండల తుఫాను హెచ్చరికల కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాలు తుఫాన్ల హెచ్చరికలు, సూచనలు చేస్తుంటాయి. అలాగే వీటి పేర్లను కూడా ఈ కేంద్రాలే పెడుతుంటాయి. ఈ ఆరు ప్రాంతీయ కేంద్రాల్లో ఇండియన్ మెట్రలాజికల్ డిపార్ట్‌మెంట్(ఐఎండీ) కూడా ఒకటి. ఈ కేంద్రలు 13 సభ్య దేశాలకు చెందిన తుఫానులకు చెందిన సమాచారం అందించడం ఈ డిపార్ట్‌మెంట్ పని.

**పేర్లు పెట్టే సంప్రదాయం ఎప్పటి నుంచి వచ్చింది?:**

తుపాన్లకు పేర్లు పెట్టే సంప్రదాయన్ని 2000 సంవత్సరంలో యునైటెడ్ నేషన్స్ ఎకనామిక్ అండ్ సోషల్ కమిషన్ ఫర్ ఏసియా అండ్ పసిఫిక్, ఇంకా వరల్డ్ మెట్రలాజికల్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా ప్రారంభించాయి. అప్పటి నుంచి ఈ తుఫాన్లకు పేర్లు పెట్టడం వస్తోంది. ఇందులో భారత్, బంగ్లాదేశ్, మల్దీవులు, ఒమన్, మయన్మార్, పాకిస్థాన్, థాయ్‌లాండ్, శ్రీలంక దేశాలు ఉన్నాయి. అయితే ఒక్కోదేశం 13 పేర్లతో ఒక జాబితాను సిద్ధం చేసింది. బంగాళాఖాతంలో, అరేబియా సముద్రాలలో ఏర్పడే ఈ తుఫాన్లకు ఈ పేర్లను పెడుతుంటారు.

**తుఫాన్ పేర్లపై ఒప్పందం:**

2000వ సంవత్సరంలో 27వ సదస్సును మస్కట్, ఒమన్‌దేశాల్లో నిర్వంచారు. ఇందులో తుఫాన్లకు పేర్లను పెట్టడంపై ఒప్పందం జరిగింది. ఇక పలుమార్లు సభ్యదేశాల మధ్య చర్చలు జరిగిన తర్వాత 2004 సెప్టెంబరులో తుఫానులకు నామకరణం చేయడం ప్రారంభమైంది. అయితే బంగాళాఖాతం, అరేబియన్ సముద్రాల తీరంలో ఉన్న ఎనిమిది దేశాలను ముందుగా గుర్తించారు. ఇంగ్లీష్‌లోని ఆల్ఫబెటిక్ ఆర్డర్ ప్రకారం వీటిని ఏర్పాటు చేశారు.

# సేమ్ ఓదార్పు !

అమరావతి : ఎవరైనా విషాదంలో మునిగిపోయిన కుటుంబాన్ని పరామర్శించడానికి ఊరేగింపుగా వెళ్తారా ?. కేరింతలు.. జయజయధ్వానాలు చేయించుకుంటూ బలప్రదర్శన చేసుకుంటూ వెళ్తారా?. చనిపోయిన వ్యక్తి కుటుంబం బాధల్లో ఉంటే రాజకీయంగా బలప్రదర్శనకు.. శవ రాజకీయానికి వాడుకుంటారా ?. అసలు అలాంటి ఆలోచన కూడా ఎవరికీ రాదు. కానీ అది జగన్ కు పెటేంట్ స్టైల్ ఓదార్పు. వైఎస్ చనిపోయినప్పుడు అదే చేశారు. ఇప్పుడు వినుకొండలో రషీద్ అనే వ్యక్తి చనిపోయినా అదే చేశారు.ఉదయం ఇంటి దగ్గర నుంచి బయలుదేరినప్పటి నుంచి అదే పని. నేరుగా వినుకొండ వెళ్లకుండా.. చిలుకలూరిపేట..నర్సరావుపేట అంటూ చుట్టూ తిరిగి.. ప్రతి పాయింట్ లోనూ నేతలతో జన సమీకరణ చేయించుకుని ఎన్నికల సమయంలోలా .. అభివాదాలు చేసుకుంటూ పోయారు. ఆయన మొహంలో చిరునవ్వు ఎక్కడా తగ్గలేదు. ఆయన తీరు చూసి హత్యకు గురైన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించడానికి వెళుతున్నట్లుగా లేదని శవ రాజకీయం చేయడానికి అవసరమైన సరంజామా దొరికినట్లు ఆనందంగా ఉందన్నట్లుగా ఉందని ఎవరికైనా అనిపిస్తుంది.అతి



స్లోగా వెళ్లి సాయంత్రం ఐదు గంటల సమయంలో వినుకొండ చేరుకున్నారు. దానికీ ఆయన పోలీసుల్నే నిందించారు. వాహనం మంచిది ఇవ్వలేదని.. కాన్వాయ్ ను అడ్డుకున్నారని రకరకాల ఆరోపణలు చేశారు. డిసెంబర్‌లో తాను ప్రారంభించాలనుకుంటున్న ఓదార్పు యాత్రకు శాంపిల్ గా%ొ% ఈ యాత్రను టెస్ట్ రన్ చేసినట్లుగా ఉందన్న సెటైర్లు వైసీపీలోనే వినిపించారు.

# ఏపీలో భారీ వర్షాలు - ఈ జిల్లాల్లోని స్కూళ్లకు సెలవు




అమరావతి : ఏపీలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. తాజాగా బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో పలు జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.ఈ నేపథ్యంలో పలు జిల్లాల కలెక్టర్ల కీలక ఆదేశాలు జారీ చేశారు.

**ఇవాళ పాఠశాలలకు సెలవు ప్రకటించారు.**

భారీ వర్షాల నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లాతో పాటు విశాఖపట్నం, తూర్పుగోదావరి, విజయనగరం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లోని స్కూళ్లకు కలెక్టర్లు ఇవాళ(జులై 20) సెలవు ప్రకటించారు. శుక్రవారం ఉత్తరాంధ్రలోని బడులకు సెలవు ప్రకటించిన సంగతి తెలిసిందే.ఇక రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయని.. లోతట్టు ప్రాంతాల్లో వరద ప్రవహిస్తున్న వాగులు,కాలువలు దాటే ప్రయత్నం చేయరాదని అధికారులు హెచ్చరించారు.

**వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు**

ఒడిశా, ఉత్తరాంధ్ర మీదుగా కొనసాగుతున్న అల్పపీడనం.. వాయుగుండంగా మారినట్లు వాతావరణ శాఖ తెలిపింది. అల్పపీడనం వాయుగుండంగా బలపడిందన్న వాతావరణ శాఖ.. వాయవ్య దిశగా పయనించి శనివారం తెల్లవారుజామున పూరీ సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేసింది. తీరం దాటిన తర్వాత వాయుగుండం క్రమంగా బలహీన పడుతుందని పేర్కొంది.ఈ నేపథ్యంలో ఇవాళ అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆయా జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది.మరోవైపు వాయుగుండం తీరే దాటే క్రమంలో శనివారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం,నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడా మోస్తారు వర్షాలు కురుస్తాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అక్కడక్కడా పిడుగులు పడే అవకాశం ఉందని హెచ్చరించింది.కాకినాడ, కోనసీమ అంబేద్కర్ జిల్లా, ఉభయ గోదావరి జిల్లాలు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలలో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. వీటితో పాటు బాపట్ల, పల్నాడు, గుంటూరు, నెల్లూరు, అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, వైఎస్ఆర్ జిల్లా, చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాలలో పిడుగులతో కూడిన వానలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు.ఏపీలో భారీ వర్షాలు నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా అత్యవసర చర్యల కోసం మూడు ఎస్టీఆర్ఎఫ్, 2 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేసినట్లు రోణంకి కూర్మనాథ్ తెలిపారు.వాగులు, కాలువలు దాటే ప్రయత్నం చేయొద్దని ప్రజలకు సూచించారు. అలాగే లోతట్టు ప్రాంతాల ప్రజలు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.భారీ వర్షాల నేపథ్యంలో విశాఖపట్నం, కళింగపట్నం, గంగవరం, కాకినాడ, భీమిలి పోర్టుల్లో మూడో నంబర్ ప్రమాద హెచ్చరికలు జారీచేశారు. అలాగే మచిలీపట్నం, నిజాంపట్నం పోర్టుల్లో ఒకటో నంబర్ ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు.

# ముచ్చుమర్రి బాలిక కేసులో ట్విస్ట్..! ఓ వ్యక్తి అనుమానాస్పద మృతి..

అమరావతి : నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలో 8 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసి హత్య తర్వాత మృతదేహాన్ని మాయం చేసిన కేసులో పోలీసుల విచారణ కొనసాగుతూనే ఉంది.అయితే, ఈ కేసులో రోజుకో.. పూటకో ట్విస్ట్ అనే మాదిరిగా కొనసాగుతూనే ఉంది.. బాలిక మిస్సింగ్ కేసులో నిర్లక్ష్యం వహించారంటూ.. నందికొట్కూరు రూరల్ సీఐ, ముచ్చుమర్రి ఎస్సై ని సస్పెండ్ చేసింది ప్రభుత్వం.. మరోవైపు.. ముచ్చుమర్రి బాలిక కుటుంబాన్ని జిల్లా మంత్రులు ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి పరామర్శించారు. బాలిక తల్లిదండ్రులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం రూ.10 లక్షల చెక్కును అందజేశారు. సొంతింటి నిర్మాణం, పిల్లలు గురుకుల పాఠశాలలో చదువుకునేందుకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు.. ఇంకో వైపు.. బాలిక మృతదేహం కోసం గాలింపు చర్యలు కొనసాగుతుండగానే.. ఈ కేసు కొత్త ట్విస్ట్ ఇచ్చింది.ఈనెల 7వ తేదీ నుంచి బాలిక కనిపించకుండా పోయింది.. ముగ్గురు మైనర్ బాలురు అత్యాచారం చేసి హత్యచేసినట్లు నిర్ధారణకు వచ్చారు పోలీసులు.. బాలిక మృతదేహాన్ని కేసీ కెనాల్ గట్టుపై పడేసినట్టు చెప్పారు.. ఆ తర్వాత కొంత దూరంలోని పొదల్లో పడవేశారని.. లేదు మరో చోట పాతిపెట్టారని.. ఇంకా.. మృతదేహం బయటకు తేలకుండా రాళ్లు కట్టి వేశారని.. ఇలా అనేక రకాలుగా ప్రచారం సాగుతూ రోజుకో ట్విస్ట్ ఇస్తూ వచ్చింది.. ఇక, నిందితులను కఠినంగా శిక్షించాలంటూ స్థానికులు, ప్రజా సంఘాలు ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. అయితే, నంద్యాలలో యోహాను(35) అనే వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు.. మృతుడు ముచ్చుమర్రి వాసిగా గుర్తించారు..



ముచ్చుమర్రి బాలికపై అత్యాచారం, హత్య కేసులో యోహానును పోలీసులు విచారించినట్టు సమాచారం.. యోహాను ఆత్యహత్య చేసుకున్నారా..? ఇంకా ఏమైనా జరిగిందా? అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని కృష్ణ నదిలో పడేసిన నిందితుల్లో యోహాను ఒకరి తండ్రి, మరొకరి పెదనాన్న అవుతారు.. నిందితులు ఐదుగురిని ఈ నెల 16న అరెస్ట్ చేశారు పోలీసులు.. మృతదేహం ఆచూకీ ఇంకా దొరకకపోవడంతో నిందితులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.. ఇంకోవైపు.. మృతదేహం కోసం 9వ తేదీ నుంచి గాలింపు చర్యలు కొనసాగుతూనే ఉండగా.. మోహాను మృతి ఈ కేసులో ట్విస్ట్ ఇచ్చినట్టు అయ్యింది.

# మైక్రోసాఫ్ట్ యూజర్స్‌కు అమెరికా సైబర్ సెక్యూరిటీ హెచ్చరిక.. హ్యాకింగ్‌కు చాన్స్

న్యూఢిల్లీ : మైక్రోసాఫ్ట్‌కు సైబర్ సెక్యూరిటీ సేవలు అందించే క్రౌడ్ స్ట్రైక్ కంపెనీ ఇచ్చిన అప్‌డేట్‌లో లోపం కారణంగా శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ సేవలకు తీవ్ర అంతరాయం కలిగిన విషయం తెలిసిందే.అయితే దీనిలో వచ్చిన బగ్‌ను ఆసరాగా చేసుకుని కొంత మంది హ్యాకర్లు సిస్టంలను హ్యాకింగ్ చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని అమెరికా సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీ %జ×ూూ% హెచ్చరించింది. టెక్నికల్ సమస్య పరిష్కారానికి లింక్‌లపై క్లిక్ చేయాలని ఈమెయిల్ ద్వారా వినియోగదారులకు వివిధ లింక్‌లను పంపిస్తున్నట్లు ఏజెన్సీ గుర్తించింది. ఈ లింక్‌లపై క్లిక్ చేయగానే వ్యక్తిగత, ఇతర ముఖ్యమైన, సున్నితమైన డేటా మొత్తం కూడా హ్యాకర్స్ చేతుల్లోకి వెళుంది. ఈ నేపథ్యంలో ఎవరూ కూడా అనుమానస్పద లింక్‌లు, ఈమెయిల్‌లకు స్పందించవద్దని ప్రజలకు సూచించింది.మరోవైపు మైక్రోసాఫ్ట్ చైర్మన్, సీఈఓ సత్య నాదెళ్ల ఈ సమస్యపై స్పందించారు. మైక్రోసాఫ్ట్ సేవల్లో అంతరాయం కలిగిన విషయం మా దృష్టికి వచ్చింది. కస్టమర్‌లకు వారి సిస్టమ్‌లను సురక్షితంగా తిరిగి తీసుకురావడానికి సాంకేతిక సమస్యలను పరిష్కరించాము. క్రౌడ్‌స్ట్రైక్ ఇచ్చిన అప్‌డేట్‌లో లోపం కారణంగా ఈ అంతరాయం తలెత్తిందని అన్నారు. ప్రస్తుతం బగ్‌ను గుర్తించి సమస్యను పరిష్కరించామని క్రౌడ్‌స్ట్రైక్ పేర్కొంది.

# మన్ కీ బాత్' ఎపిసోడ్‌కి సూచనలు ఆహ్వానించిన ప్రధాని మోదీ.. ఎలా పంపాలంటే?



అమరావతి: భారత ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి కొన్ని ప్రోగ్రామ్స్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. వాటిలో ప్రతి నెలా చివరి ఆదివారం ప్రసారమయ్యే 'మన్ కీ బాత్' ఒకటి.2014 నుంచి కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ రేడియో ప్రోగ్రామ్ కోసం ఎంతోమంది ఎదురు చూస్తుంటారు. అయితే జులై 28 ఆదివారం జరగబోయే ఎపిసోడ్ కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజల సూచనలు ఆహ్వానించారు. దీనికి సంబంధించి ప్రధాని మోదీ జులై 19న శుక్రవారం ఉదయం, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో ఓ పోస్ట్ షేర్ చేశారు. అందులో, 'ఈ నెల 28న ఆదివారం జరిగే చమన్‌కీబాత్‌కి సంబంధించి అనేక ఇన్‌పుట్స్ వస్తున్నాయి. ముఖ్యంగా అనేక మంది యువకులు మన సమాజాన్ని మార్చే లక్ష్యంతో సమిష్టి కృషిని హైలైట్ చేయడం ఆనందంగా ఉంది.' అని పేర్కొన్నారు. మరింత మంది పౌరులు తమ సూచనలతో ముందుకు రావాలని ప్రోత్సహిస్తూ, 'మీరు MyGov, NaMo యాప్‌లో ఇన్‌పుట్స్ షేర్ చేయవచ్చు. లేదా 1800-11-7800లో మీ మెసేజ్ రికార్డ్ చేయవచ్చు.' అని తెలిపారు.

**2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత మొదటి కార్యక్రమం**

లోక్‌సభ ఎన్నికల తర్వాత, జూన్ 30న నిర్వహించిన 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ కొత్త ప్రభుత్వంలో తొలిసారిగా జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ఆకాశవాణి సంస్కృత బులెటిన్‌కి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రాచీన భారతీయ విజ్ఞానం, విజ్ఞాన శాస్త్రంలో సంస్కృతం ప్రాముఖ్యత గురించి ఆయన మాట్లాడారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రారంభించిన 'ఏక్ పెడ్ మా కే నామ్' ప్రచారాన్ని కూడా ఆయన హైలైట్ చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పౌరులు, ప్రజలు తమ తల్లులతో కలిసి చెట్ల పెంపకం కార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. మాతృత్వం, పర్యావరణం రెండింటినీ ఇలా సెలబ్రేట్ చేసుకోవాలని తెలిపారు.

**'మన్ కీ బాత్' గురించి**

'మన్ కీ బాత్' అనేది ఒక రేడియో ప్రోగ్రామ్. దీంట్లో ప్రధాని మోదీ భారత పౌరులతో జాతీయ సమస్యలపై చర్చిస్తారు. ఈ కార్యక్రమం ప్రతి నెలా చివరి ఆదివారం ప్రసారమవుతుంది. 2014 అక్టోబర్ 3న ప్రోగ్రామ్ ప్రారంభమైంది. మహిళలు, వృద్ధులు, యువతతో సహా భారతీయ సమాజంలోని వివిధ వర్గాలతో కనెక్ట్ అవ్వడం దీని లక్ష్యం.

**అనేక భాషల్లో ప్రసారం**

'మన్ కీ బాత్' కార్యక్రమం 22 భారతీయ భాషలు, 29 మాండలికాలతో పాటు ఫ్రెంచ్, చైనీస్, ఇండోనేషియన్, టిబెటన్, బర్మీస్, బలూచి, అరబిక్, పష్టు, పర్షియన్, డారీ , స్వాహిలి సహా 11 విదేశీ భాషల్లో ప్రసారం అవుతుంది. ఆల్ ఇండియా రేడియోకు చెందిన 500 కంటే ఎక్కువ కేంద్రాల ద్వారా స్ట్రీమింగ్ జరుగుతుంది. ప్రజల జీవితాలపై 'మన్ కీ బాత్' ప్రభావం గురించి గతంలో ఒక అధ్యయనం నిర్వహించగా.. కనీసం 100 కోట్ల మంది ప్రజలు ఒక్కసారైనా ఈ ప్రోగ్రామ్‌కు కనెక్ట్ అయ్యారని తేలింది. అట్టడుగు స్థాయిలో మార్పు కోసం చేసే ప్రయత్నాలు, సాధించిన విజయాల కారణంగా మన్ కీ బాత్ పాపులర్ అయింది.

# ఆఫీసు రాకుంటే లీవ్ కట్..హెచ్‌సీఎల్ సంచలన నిర్ణయం!

అమరావతి: కరోనా మహమ్మారి ప్రభావం తగ్గిన తర్వాత ఐటీ కంపెనీలు తమ ఉద్యోగులను ఆఫీసులకు రప్పించేందుకు వివిధ రకాల చర్యలు చేపడుతున్నాయి. ఇందులో భాగంగా అనేక ఐటీ కంపెనీలు హైబ్రిడ్ విధానంలో వారంలో మూడు రోజులు తప్పనిసరిగా ఆఫీసు రావాలని ఆదేశాలు జారీ చేశాయి.ప్రముఖ ఐటీ సేవల సంస్థ హెచ్‌సీఎల్ టెక్నాలజీస్‌కూడా ఇలాంటి విధానాన్ని అనుసరిస్తోంది. అయితే కొంతమంది ఉద్యోగులు ఏదో ఒక కారణంతో ఆఫీసుకి రాకుండా ఇంటి నుంచే పని చేస్తున్న నేపథ్యంలో హెచ్‌సీఎల్ కీలక నిర్ణయం తీసుకుంది. వారానికి మూడు రోజుల ఆఫీసు పనిని కచ్చితంగా అమలు చేసేందుకు హెచ్‌సీఎల్ కొత్త విధానాన్ని తీసుకొచ్చింది.ఉద్యోగుల ఆఫీసు అటెండెన్స్‌తో లీవ్స్‌కి లింక్ పెట్టిందని సమాచారం. కనీసం వారంలో మూడు రోజులు ఉద్యోగులు ఆఫీసుకు రావాలని, రాని రోజులను లీవ్‌గా పరిగణించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ భయంతోనైనా ఉద్యోగులు ఆఫీసుకు వస్తారని హెచ్‌సీఎల్ టెక్ తాజా నిర్ణమాన్ని బట్టి అర్థమవుతోంది.ప్రస్తుతం హెచ్‌సీఎల్‌లో ఉద్యోగులు వారంలో కనీసం మూడు రోజులు చొప్పున కార్యాలయాల్లో పనిచేయాలి. నెలకు 12 రోజుల పాటు ఆఫీసుల నుంచి పనిచేయాలి. అంతకంటే తక్కువ రోజులు కార్యాలయాలకు హాజరైతే ఆ రోజుల్ని గైర్హాజరుగా పరిగణించి వారి లీవ్‌ల నుంచి మినహాయిస్తారు. అంటే 12 రోజులు కాకుండా 10 రోజులే ఓ




ఉద్యోగి ఆఫీసుకు వచ్చాడు అనుకుంటే.. అప్పుడు అతడి లీవ్స్‌లో రెండు రోజులు కోత పడుతుంది. ఈ మేరకు కొన్ని టీమ్‌లకు హెచ్‌ఆర్ విభాగం నుంచి ఇది వరకే సమాచారం వెళ్లినట్లు తెలుస్తోంది.సెలవులన్నీ పూర్తయిన తర్వాత ఆఫీసుకు రాని రోజును లాస్ ఆఫ్ పేగా పరిగణిస్తారు. వారంలో కనీసం మూడు రోజులు చొప్పున ఆఫీసుకు రావాలని కంపెనీ నిర్ణయించిన ఐదు నెలలకు ఈ విధానం అమలు చేయడం గమనార్హం. ప్రస్తుతం మూడేళ్లలోపు హెచ్‌సీఎల్ ఉద్యోగికి ఏటా 18 లీవ్‌లు, ఒక పర్సనల్ లీవ్ ఉంటుంది. మూడేళ్లు పైబడిన వారికి 20 యాన్యువల్ లీవ్స్, రెండు పర్సనల్ లీవ్స్ ఉంటాయి.

# కంప్యూటర్ సైన్స్‌కే తొలి ప్రాధాన్యత.. మొదటి విడత కౌన్సెలింగ్‌లోనే..!



అమరావతి:రాష్ట్రంలో ఇంజనీరింగ్ సీట్లు హాట్ కేకులను తలపిస్తున్నాయి. ఇంజినీరింగ్ సీట్ల తొలి విడత కౌన్సెలింగ్‌లో 86 శాతం సీట్లు భర్తీ అయ్యాయి.ఈ ఏడాది కన్వీనర్ కోటాలో మొత్తం 245 కళాశాలల్లో 1,36,660 సీట్లు ఉండగా తొలి దశలో 1,17,136 సీట్లు భర్తీ అవడం విశేషం. 19,524 సీట్లు మలి విడత కౌన్సెలింగ్ ద్వారా కేటాయిస్తారు.విద్యార్థులు కంప్యూటర్ సైన్సుకే తొలి ప్రాధాన్యతనిచ్చారు. ఆ తర్వాత ఈసీఈకి డిమాండ్ ఉంది. కాలేజీలు కూడా ఇదే దృష్టితో కంప్యూటర్ సైన్సు సీట్లను ఎక్కువగా అందుబాటులో ఉంచాయి. ఈ మేరకు అఖిలభారత సాంకేతిక విద్యా మండలి నుంచి అనుమతులు తెచ్చుకున్నాయి.

**కంప్యూటర్ సైన్స్‌లోనే ఎక్కువ..**

కంప్యూటర్ సైన్స్‌లో కన్వీనర్ కోటాలో 42,303 సీట్లు ఉండగా, 40,242 సీట్లు తొలి దశలోనే భర్తీ అయ్యాయి. అంటే సీట్లన్నీ దాదాపుగా భర్తీ అయ్యాయి. ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో (ఈసీఈ)లో 24,121 సీట్లు ఉండగా, 21,060 సీట్లను కేటాయించారు. సీఎస్ఈ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్)లో 11,156 సీట్లకు గాను 10,133 సీట్లు భర్తీ అయ్యాయి. ఫెసిలిటైస్ అండ్ సర్వీసెస్ ప్లానింగ్‌లో 66 సీట్లలో ఒక్కటి కూడా భర్తీ కాలేదు.కన్‌స్ట్రక్షన్ అండ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్‌లో 64 సీట్లకు గాను 7 సీట్లే భర్తీ అయ్యాయి. తొలి దశ కౌన్సెలింగ్ 17వ తేదీతో ముగిసింది. శుక్రవారం నుంచి కళాశాలల్లో తరగతులు ప్రారంభమయ్యాయి. తొలి విడతలో మిగిలిన 19,524 సీట్లకు వచ్చే వారంలో మలి విడత కౌన్సెలింగ్‌కు సాంకేతిక విద్యా శాఖ చర్యలు చేపడుతోంది. దానికంటే ముందే ఎన్ఆర్ఐ, కేటగిరీ-బి సీట్ల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వనుంది. చివరి దశలో కళాశాలలకు స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పించనుంది.

**వైఎస్ జగన్ దార్శనికతతో..**

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దార్శనికత, సంస్కరణలతో మెరిట్ సాధించిన పేద, మధ్య తరగతి విద్యార్థులు కూడా ప్రైవేటు వర్సిటీల్లో సీట్లు సాధించుకోగలిగారు. రాష్ట్రంలో 9 ప్రైవేటు వర్సిటీలు ఉన్నాయి. వీటిలో గ్రీన్‌ఫీల్డ్ వర్సిటీల్లో 35 శాతం, బ్రౌన్ ఫీల్డ్ వర్సిటీల్లో 70 శాతం సీట్లను ఏపీఈఏపీసెట్‌లో మెరిట్ సాధించిన విద్యార్థుల కు కన్వీనర్ కోటాలో కేటాయించేలా గత వైఎస్ జగన్ సర్కారు సంస్కరణలు తెచ్చింది. దీంతో గడిచిన రెండేళ్లలో 7 ప్రైవేటు వర్సిటీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు ఎందరో పేదింటి విద్యార్థులు మెరుగైన ఉన్నత విద్యను అందుకున్నారు.ఈ ఏడాది ప్రైవేటు వర్సిటీలు 9కి చేరడంతో సీట్ల సంఖ్య 7,832కు చేరుకుంది. ఇందులో ఈ ఏడాది కౌన్సెలింగ్‌లో తొలి విడతలోనే 7,700 సీట్లను విద్యార్థులు దక్కించుకున్నారు. గతంలో 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వంలో ప్రైవేటు వర్సిటీల్లో చదువంటే పేద మెరిట్ విద్యార్థులకు సాధ్యమయ్యేది కాదు. లక్షల్లో ఫీజులు చెల్లించే వారికే అక్కడ సీట్లు దక్కేవి.ఆ తర్వాత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా రావ డంతోఈ వర్సిటీల్లో పేద విద్యార్థులూ చదువుకోగలు గుతున్నారు.

# Indian Army Deploys 500 Elite Para Special Forces Commandos To Counter Terrorism

